PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 342 | విజయవాడ, సోమవారం 15 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 15 July 2024 | Rs

అంగన్‌వాడీ సమ్మె చారిత్రాత్మకం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- '42 రోజుల సమ్మె అనుభవాలు' పుస్తకావిష్కరణ

లోపలి పేజీలో..

వింబుల్డన్ విజేత అల్కరాజ్ 6



పెన్సిల్వేనియాలోని బట్లర్ సభలో ఆగంతకుడి కాల్పుల్లో గాయపడిన ట్రంప్

ట్రంప్‌పై హత్యాయత్నం

- గాయాలతో బయటపడిన మాజీ అధ్యక్షుడు
- ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు
- దుండగుడిని మట్టుపెట్టిన సీక్రెట్ సర్వీస్
- దాడిని ఖండించిన మోడీ, రాహుల్

వాషింగ్టన్ : కల్లోల పరిస్థితుల్లో ఉన్న అమెరికాలో ఆ దేశ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థిత్వ రేసులో ముందున్న డొనాల్డ్ ట్రంప్ (78)పై శనివారం హత్యాయత్నం జరిగింది. ట్రంప్ కుడి చెవిని తాకుతూ తుపాకీ గుండు దూసుకుపోవడంతో గాయాలతో ఆయన బయటపడ్డారు. అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తిపై హత్యాయత్నం జరగడం గత నాలుగు దశాబ్దాల్లో ఇదే మొదటిసారి. అమెరికా కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 6.15 గంటలకు పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో వేలాది మంది మద్దతుదారుల నుద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తుండగా పెద్ద చప్పుడు వినబడింది. ట్రంప్ వెంటనే నేలపై వాలిపోయాడు. సీక్రెట్ సర్వీస్ ఒక్క ఉదుటన వేదికపైకి చేరుకుని ట్రంప్‌కు రక్షణగా నిలిచాయి. ఆయనను వేదిక మీది నుంచి మోటార్ కేడ్‌కు తీసుకెళ్లి ఆసుపత్రికి తరలించారు.. అనుమానాస్పద షూటర్‌ను సీక్రెట్ సర్వీస్ దళాలు హతమార్చాయి. అతనిని పెన్సిల్వేనియాలోని బెథెల్ పార్కుకు చెందిన 20 సంవత్సరాల థామస్ మాథ్యూ క్రూక్స్‌గా గుర్తించారు. అతడు ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. కాల్పుల్లో గాయపడిన ట్రంప్ ముఖంపై రక్తం కారడం కన్పించింది. ఘటనా స్థలం నుండి అధికారులు ఒక ఆర్మాలైట్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో ట్రంప్ వెనక ఉన్న ఒక ప్రేక్షకుడు చనిపోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థ తెలిపింది. ట్రంప్‌పై దాడిని భారత ప్రధాని నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా పలు దేశాల నేతలు ఖండించారు. ఖండించినవారిలో ఇటీవలే హత్యాయత్నం నుంచి తప్పించుకున్న స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో కూడా ఉన్నారు. అమెరికన్ డెమొక్రాట్స్‌లో సోషలిస్టు బెర్నీ శాండర్స్ ఎన్‌బిసితో మాట్లాడుతూ, ట్రంప్‌పై దాడి ఊహించ లేదని అన్నారు. డెమొక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్ ఉండాలా? వద్దా? అన్న చర్చపై దీని ప్రభావం ఉండబోదని అన్నారు. డెమొక్రటిక్ గట్టి అభ్యర్థి బైడెన్ అని శాండర్స్ పేర్కొన్నారు.

ఘటన అనంతరం ట్రంప్ సామాజిక మాధ్యమంలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'నా ఎడమ చెవి పైన గాయమైంది. శబ్దం వినపడగానే ఏదో జరిగిందని అర్థమైంది. కాల్పుల మిగతా 5లో

అక్రమాలపై విచారణ

- నిర్వాసితుల పరిహారంపై నిపుణుల కమిటీ
- పునరావాస వ్యయం పూర్తిగా కేంద్రమే భరించాలి
- పోలవరం శ్వేతపత్రంపై సెమినార్‌లో వక్తలు

సెమినార్‌లో మాట్లాడుతున్న బివి రాఘవులు. వేదికపై ఆర్ ఉమామహేశ్వరి, వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, లోతా రామారావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను నిర్ధారించేందుకు ఉన్నతస్థాయి కమిటీని, నిర్వాసితులైన గిరిజనులకు, పేదలకు పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు నిపుణుల కమిటీని నియమించాలని, ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం ఖర్చు కేంద్రమే భరించాలని సెమినార్‌లో వక్తలు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షతన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో పోలవరం శ్వేతపత్రంపై సెమినార్ ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ.. అమరావతి రాజధాని, ఔటర్ రింగ్ రోడ్లు, పోలవరం కుడికాల్వ రైతులకు ఇచ్చిన రీతిలో పోలవరంలోని నిర్వాసితులు, రైతులకు పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. నిర్మాణంలో ఉన్న కాఫర్‌డ్యామ్, డయాఫ్రం వాల్, గైడ్ బండ్ ధ్వంసమైన ఘటనలపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపి, భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలకు చోటివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదిపై ప్రాజెక్టులు కట్టిన రీతిలో గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించడం కష్టమని మొదటి నుండి ప్రొఫెసర్ శివాజీరావు వంటి నిష్ణాతులు చెబుతున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2004లో చేపట్టిన జలయజ్ఞంలోని పోలవరం ప్రాజెక్టు 2024 వరకు ముఖ్యమంత్రులు మారినా, ఎవరూ చిత్తశుద్ధితో పనిచేయలేదన్నారు. ప్రాజెక్టుల్లో మొదట మనుషులకు ప్రాధాన్యత వుండాలని, ఆ తర్వాత నీళ్లకు, ఆ పైన ప్రాజెక్టు నిర్మాణం అన్నారు. కాని పోలవరం విషయంలో మనుషులను పట్టించుకోవడం లేదన్నారు. నిర్వాసితులైన గిరిజనులను ఏమాత్రం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. ఇదే ప్రాజెక్టు పరిధిలోని కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.38 లక్షల నుండి రూ.48 లక్షల నష్టపరిహారాన్ని ఇచ్చిన ప్రభుత్వం.. గిరిజనులు ముంపులో కోల్పోయిన భూములకు మాత్రం ఎకరాకు రూ.రెండు లక్షల నుండి రూ.ఐదు లక్షలు ఇవ్వడం అన్యాయమన్నారు. అమరావతిలో రాజధానికి భూములను ల్యాండ్ పూలింగ్ చేసిన వారికి, ఔటర్ రింగ్‌రోడ్డులో, పోలవరం కెనాల్‌లో రైతులకు నష్టపరిహారం ఇచ్చినట్లు పోలవరంలో ముంపు భూములు కోల్పోయిన గిరిజనులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నిర్వాసితుల త్యాగాలతో పోలవరం కడితే రైతులకు ఏ మేర లాభం చేకూరుతుందో ఆ మేర లబ్ధి.. త్యాగం చేసిన రైతుకు ఎందుకివ్వరు అని ప్రశ్నించారు. భూమికి భూమిగా నీటి పారుదల సౌకర్యం వున్న భూములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలా త్యాగం చేసిన గిరిజనుల నష్టపరిహారాన్ని తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసి, పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. 2004 నుండీ ప్రాజెక్టు నిర్మాణం మొత్తం కాంట్రాక్టర్లు చుట్టే నడుస్తోందని విమర్శించారు. డ్యామ్ కట్టకముందే పునరావాసం పూర్తిచేయాలని, అందుకే కాఫర్‌డ్యామ్ పూర్తికాకుండా గ్యాప్‌లు పెట్టి, డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చేపట్టారన్నారు. కాఫర్‌డ్యామ్, డయాఫ్రం వాల్‌ల ధ్వంసం, గైడ్ బండ్ కుంగిన ఘటనలపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని రాఘవులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో సాంకేతికంగా తప్పు జరిగినా, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల వైపు తప్పు జరిగినా నష్టపరిహారాన్ని వసూలు చేసేలా విచారణ కమిటీకి విధి విధానాలను రూపొందించాలన్నారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణమంతా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రముఖ పరిశోధకులు ఆర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు ఎక్కడ కట్టినా చితికిపోయేది మాత్రం పేదరైతులు, ఆదివాసీలేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్రాజెక్టు కడితే వేల మంది ప్రజలు తమ చరిత్రను, సంస్కృతిని, జీవనాధారమైన భూములను, చివరకు వున్న ఇంటిని కూడా కోల్పోతారని అన్నారు. సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై విడుదల చేసిన శ్వేతపత్రంలో నిర్వాసితులు కనిపించకపోవడం అన్యాయమని అన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు టి అంజయ్య ముఖ్యమంత్రిగా వున్నప్పటి నుండి సమస్యగానే వుందన్నారు. 2004లో ప్రాజెక్టును కట్టకుండా కాల్వలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడితే 2014లో కేంద్ర ప్రభుత్వం నిర్మించాల్సిన ప్రాజెక్టును రాష్ట్రం చేస్తుందని చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి కేంద్ర ప్రభుత్వం భూసేకరణతో తమకు సంబంధం లేదని కేవలం స్ట్రక్చర్ నిర్మాణానికే డబ్బులు ఇస్తామని అనడం బాధ్యతారాహిత్యమని అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి పునరావాసంతో సహా మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి నిధులు సాధించే బాధ్యత చంద్రబాబుదేనన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం పనులను ఏ మాత్రం చేపట్టకుండా ప్రాజెక్టు నిర్మాణం చుట్టూ తిరగడం తగదని అన్నారు. సిపిఎం ప్రజల పక్షం వహించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని, నిజమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందనీ అన్నారు. సిపిఎం నాయకులు లోతా రామారావు వందన సమర్పణ చేశారు. ఈ సెమినార్‌లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు, ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, సిపిఎం నాయకులు మంతెన సీతారాం, కె ప్రభాకర్‌రెడ్డి, ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ కొత్త ప్రధానిగా ఓలి

- నేడు ప్రమాణస్వీకారం

ఖట్మాండు : నేపాల్ నూతన ప్రధానమంత్రిగా కెపి శర్మ ఓలి ఆదివారం నియమితులయ్యారు. ఈ నెల 12న జరిగిన విశ్వాస పరీక్షలో పుష్ప కమల్ దహల్ (ప్రచండ) ఓడిపోవడంతో ఆయన ప్రభుత్వం రాజీనామా చేసింది. సిపిఎన్ (యుఎంఎల్), నేపాలీ కాంగ్రెస్‌తో చేతులు కలిపి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. వీరి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తదుపరి ప్రధానిగా సిపిఎన్ (యుఎంఎల్) నేత కెపి శర్మ ఓలి పేరు ఖరారైంది. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు తనను పిలవాలని కోరుతూ నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సి) అధ్యక్షులు షేర్ బహదూర్ దేవ్‌బాతో కలిసి అధ్యక్షుడిని ఓలి కోరారు. తనకు మద్దతుగా ప్రతినిధుల సభలో 165 మంది మద్దతు ఉన్నట్లు ఓ జాబితాను సమర్పించారు. వారిలో 77 మంది సిపిఎన్ (యుఎంఎల్)కు చెందినవారు కాగా, మిగతా 88 మంది నేపాలీ కాంగ్రెస్ సభ్యులు. కొత్త ప్రధానిగా ఓలిని దేశ అధ్యక్షులు ఆదివారం నియమించారు. కేబినెట్ మంత్రులతో కలిసి ఓలి సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ముంబయిలో మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండేతో సమావేశమైన చంద్రబాబునాయుడు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏక్‌నాథ్ తనయుడు, ఎంపి శ్రీకాంత్ షిండే

మహారాష్ట్ర సిఎంతో చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముంబాయిలో భేటీ అయ్యారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ ఇంట్లో వివాహ కార్యక్రమానికి చంద్రబాబు శనివారం హాజరయ్యారు. ఈ వివాహ కార్యక్రమంలో ఇద్దరూ కలుసుకున్నారు. ఏక్‌నాథ్ షిండే ఆహ్వానం మేరకు ఆదివారం ఉదయం ఆయన నివాసానికి చంద్రబాబు వెళ్లారు. చంద్రబాబుకు సాదర స్వాగతం పలికిన షిండే పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సుమారు అరగంట పాటు ఇరువురి భేటీ సాగింది. తాజా రాజకీయ పరిస్థితులు, పలు రంగాల్లో పరస్పర సహకారం, మౌలిక వసతుల అభివృద్ధి, పలు ఆర్థిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాల్లో డిజిటల్ రంగంలో అవకాశాల విస్తరణ తదితర అంశాలపై కూడా ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. ఇరు రాష్ట్రాలు పరస్పర సహకారం ద్వారా అభివృద్ధిని ఎలా సాధించవచ్చనే అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు భేటీ అనంతరం షిండే సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పొందుపరిచారు. ఈ సమావేశంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, మహారాష్ట్ర మంత్రి దాదా భుసే, షిండే తనయుడు, ఎంపి శ్రీకాంత్ షిండే పాల్గొన్నారు. టిడిపి, శివసేన (షిండే) కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాయి.

తమకు టీచర్‌ను కేటాయించాలని స్కూలు షెడ్డు వద్ద వేడుకుంటున్న విద్యార్థులు

స్కూల్ షెడ్డు వేసుకున్నాం.. టీచర్‌ను పంపండి సారూ..

- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వేడుకోలు

లోపలి పేజీలో..

ఎడతెరపిలేని వాన

- పలు జిల్లాల్లో రోజంతా వర్షపాతం
- అల్లూరి జిల్లాలో యువకుడు గల్లంతు

3 రోజుల శిశువు అపహరణ

గంటల వ్యవధిలోనే ఛేదించిన మచిలీపట్నం పోలీసులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (కృష్ణా)

నర్స్ వేషంలో ఓ మహిళ వచ్చి శిశువును అపహరించిన ఘటన కృష్ణా జిల్లా మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చోటు చేసుకుంది. గంటల వ్యవధిలోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. మచిలీపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన స్వరూపరాణి మూడు రోజుల క్రితం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో మగ శిశువుకు జన్మనిచ్చారు. శనివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో మెలకువ వచ్చిన ఆమె వాష్ రూమ్‌కు వెళ్లాలని అనుకున్నారు. ఆ సమయంలో నర్స్ వేషంలో ఆమె వద్దకు ఒక మహిళ వచ్చారు. బాబును చూస్తానని, వాష్ రూముకు వెళ్లి రమ్మని ఆమెకు చెప్పారు. దీంతో, స్వరూపరాణి తన బిడ్డను ఆమెకు అప్పగించి వాష్ రూముకు వెళ్లి వచ్చారు. అనంతరం తన బిడ్డను తీసుకొని పక్కనే వేసుకొని నిద్రపోయారు. అదే అదనుగా ఆ బిడ్డను ఆ మహిళ అపహరించుకుపోయారు. తెల్లవారు జామున కుటుంబ సభ్యులు వచ్చి చూడగా స్వరూపరాణి పక్కన ఉండాల్సి బిడ్డ కనిపించలేదు. దీంతో, తల్లి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసు బృందాలు గాలించాయి. శిశువును ఇంగ్లీష్‌పాలేనికి చెందిన తమ్మిశెట్టి లక్ష్మి అపహరించినట్లు గుర్తించి, ఆమెను అదుపులోకి తీసుకొని శిశువును తల్లి ఒడికి పోలీసులు చేర్చారు. నిందితురాలి వెనక శిశువులను

శిశువును ఎత్తుకెళ్తున్న మహిళ

అపహరించే ముఠాలు ఏమైనా ఉన్నాయా? అపహరణకు కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కొల్లు సీరియస్

సర్వజన ఆస్పత్రిలో శిశువు అదృశ్యంపై రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సీరియస్ అయ్యారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలీసు వెంటనే స్పందించి విచారణ జరిపారని, సిసి ఫుటేజ్ ద్వారా నిందితురాలిని గుర్తించారని తెలిపారు. నిందితురాలికి ఆస్పత్రిలో ఎవరైనా సహకరించారా? అనే కోణంలో విచారణ చేస్తామని చెప్పారు. ఈ ఘటన నేపథ్యంలో గైనిక్ వార్డు స్టాఫ్ నర్స్‌ని, సెక్యూరిటీ గార్డ్‌ని సస్పెండ్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎన్.రమేష్ కుమార్ తెలిపారు. మరో నలుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు.

పసికందుపై దారుణం

- వరుసకు తాతయ్య అయ్యే వ్యక్తి ఘోర అఘాయిత్యం 3

'రత్న భండార్'లోని విలువైన వస్తుల కోసం కలప, కంచుతో తయారు చేయించిన ప్రత్యేక పెట్టెలు

తెరుచుకున్న జగన్నాథ ఆలయ రత్న భాండాగారం

పూరీ : ఎట్టకేలకు ఒడిశా పూరీలోని జగన్నాథ ఆలయానికి చెందిన రత్న భాండాగారం తెరుచుకుంది. దీనిని చివరిసారిగా 1978లో తెరిచారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు (ఎస్ఒపి)ని అనుసరించి అధికారులు ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటలకు రత్న భాండాగారాన్ని తెరిచినట్లు శ్రీ జగన్నాథ ఆలయ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ (ఎస్‌జెటిఎ) చీఫ్ అరబింద పాఢీ తెలిపారు. దాదాపు నాలుగు గంటల ప్రయత్నాల తర్వాత రెండు గదులను తెరిచామని, రత్న భాండాగారం లోపలి గది తాళాలు రాకపోవడంతో వాటిని పగులగొట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "బయటి గదిలోని ఆభరణాలను ఆలయ సముదాయంలోని తాత్కాలిక బలమైన మిగతా 5లో

జిపిఎస్ మోసపూరితం

- రద్దుకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- రేపు, ఎల్లుండి నిరసనలకు పిలుపు

లోపలి పేజీలో..

ప్రశ్నించే వారిని హింసించడమే క్రిమినల్ చట్టాల లక్ష్యం

- 'ఐలు' నేత సుంకర రాజేంద్ర ప్రసాద్ విమర్శ

పింఛన్ల కోసం ఎదురుచూపులు

- ఏడాదిగా నిలిచిన మంజూరు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో సామాజిక పింఛన్ల మంజూరు ఏడాదిగా నిల్చిపోయింది. దీంతో, సుమారు మూడు లక్షల మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం నవశకం పథకంలో భాగంగా ఏటా జనవరి, జులై నెలల్లో కొత్త వారికి పింఛన్లు మంజూరు చేస్తూ వచ్చింది. అయితే, గతేడాది జులై, ఏడాది జనవరిలో పింఛన్లు మంజూరు చేయకుండా దరఖాస్తులన్నింటినీ పెండింగ్‌లో పెట్టేసింది. దీంతో, రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం 2023 జనవరికి ముందు దరఖాస్తు చేసుకున్న వారికి జులైలో అనుమతి మంజూరు చేసింది. 2023 జులై ఒకటో తేదీ నుంచి 23వ తేదీ వరకు జగనన్న సురక్షలో బియ్యం కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. దీంతో, జులై వరకు పెండింగ్‌లో ఉన్న పింఛన్ల దరఖాస్తులకు ఆమోదం తెలిపి వారికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసింది. ఆ తర్వాత కొత్త వారికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినా మంజూరు చేయలేదు. కొత్తగా రేషన్ కార్డుల దరఖాస్తులను గతేడాది డిసెంబరు వరకు అనుమతి ఇచ్చినా పింఛన్లకు అనుమతి ఇవ్వలేదు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు ఎన్నికల ముందు అవకాశం ఇస్తారని భావించినా అలా జరగలేదు. బియ్యం కార్డుల జారీ ప్రక్రియ ఏడు నెలలుగా, కొత్త పింఛన్ల మంజూరు ఏడాదిగా పెండింగ్‌లో ఉంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా ఇంత వరకు పెండింగ్‌లో ఉన్న పింఛన్లకు, రేషన్ కార్డుదారులకు క్లియరెన్సు ఇవ్వలేదు. కొత్త పింఛన్లకు దరఖాస్తులను కూడా స్వీకరించడం లేదు. వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు కూడా పింఛన్ల కోసం దరఖాస్తుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న వారికి, కొత్త దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చే విషయంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు. 2021లో నవశకం సర్వే తరువాత 7 లక్షల రేషన్ కార్డులను తొలగించారు. వీరిలో 60 శాతం మంది తమకు అర్హత ఉన్నా కార్డులను తొలగించారని, కొత్త ప్రభుత్వమైనా కార్డులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పక్షవాతంతో బాధపడుతున్నా...

మూడున్నరేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. సదరం సర్టిఫికెట్ కోసం భీమడోలు, తణుకు, తాడేపల్లిగూడెం వెళ్లాం. ఆఖరికి తాడేపల్లిగూడెంలో 90 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటే ఇది తాత్కాలిక ధ్రువపత్రం అని పింఛను మంజూరు చేయలేదు. నా కుమారుడు జాన్‌బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లీడుకొచ్చిన కుమార్తె ఉంది. ఆర్థికంగా చాలా బాధలు పడుతున్నాం. పింఛను మంజూరు చేస్తే నా కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది.

-శానం ఏసు, ఉంగుటూరు మండలం కైకరం, ఏలూరు జిల్లా

రాజకీయ వివక్ష చూపారు.

నాలుగేళ్ల క్రితం పక్షవాతం వచ్చి కాళ్లు చేతులు సచ్చుబడిపోయాయి. పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాను. టిడిపి సానుకూలంగా ఉన్నాననే కారణంతో రాజకీయ వివక్ష చూపించి పింఛను మంజూరు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో అయినా పింఛను ఇవ్వాలని కోరుతున్నాను.

-పింఛల సుబ్బయ్య, పెడన, కృష్ణా జిల్లా

పోలవరం శ్వేతపత్రంలో ప్రజలు లేరు

- ప్రాజెక్టులు ఎక్కడొచ్చినా ధ్వంసమయ్యేది పేద రైతులు, ఆదివాసీలే
- ప్రముఖ పరిశోధకురాలు ఉమామహేశ్వరి

పోలవరంపై తన పరిశోధనలో వెలుగుచూసిన అంశాలను వివరిస్తున్న ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన శ్వేతపత్రంలో ఎక్కడా ప్రజలు లేకపోవడం దారుణమని ప్రముఖ పరిశోధకురాలు, రచయిత ఆర్ ఉమామహేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినా, జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినా పూర్తిగా ధ్వంసమయ్యేది, చితికిపోయేది పేద రైతులు, ఆదివాసీలేనని తెలిపారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సిపిఎం ఆధ్వర్యాన జరిగిన పోలవరం శ్వేతపత్రంపై సెమినార్‌లో ఆమె పోలవరం ప్రాజెక్టుతో పాటు హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్రాజెక్టుల కింద నలిగిపోయిన బాధితుల సమస్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. తాను స్వయంగా చూసిన గ్రామాలు, ప్రజలు, సహజ సిద్ధమైన గుర్తులు ఇప్పుడు అక్కడ లేవన్నారు. శ్వేతపత్రంలో చంద్రబాబు చూపిన మ్యాప్‌లో ఎక్కడా గ్రామాలు, ప్రజలు, ప్రజల సంస్కృతి కనిపించడం లేదన్నారు. 2006 నుండి 2013 వరకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని ప్రతి గ్రామంలో పర్యటించి నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేశానని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులతో అంతా మంచి జరుగుతుందని అందరూ అంటారని, కాని తన అనుభవంలో అది వాస్తవం కాదని తేలిందన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డ్యామ్‌ను కట్టారని తెలిపారు. ప్రకృతిని ధ్వంసం చేస్తూ కొండలను, అటవీ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నారని తెలిపారు. అందుకే ఊహకు అందని రీతిలో ప్రమాదకరంగా హిమాచల్‌ప్రదేశ్‌లో వరదలు వచ్చాయన్నారు. కార్పొరేట్‌లకు అవసరమైతే నదీ ప్రవాహాన్ని కూడా మారుస్తారని అన్నారు. భవిష్యత్ గురించి ఆలోచన లేకుండా ప్రకృతిని ధ్వంసం చేస్తే జరిగే విధ్వంసం చాలా ప్రమాదకరంగా వుంటుందన్నారు. ఇందులో ఎంతో మంది పేదరైతులు, ఆదివాసీల జీవితాలను, చరిత్రను, సంస్కృతిని ధ్వంసం చేస్తున్నారని అన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కోట్ల రూపాయల నష్టపరిహారం గురించి మాట్లాడుతారు కానీ పోలవరం ప్రాజెక్టులో అలాంటి నష్టపరిహారం కూడా కనిపించదన్నారు. డబ్బు ఇచ్చేస్తే సమస్య పరిష్కారం కాదని, ఆ ఊరితో, పొలంతో, చెట్టూచేమతో తరతరాలుగా వున్న తమ అనుబంధాన్ని, భవిష్యత్‌ను ప్రజలు కోల్పోతారని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. చాలా మంది నిర్వాసితుల ఆధార్ నెంబర్ తీసుకుని వారి అంగీకారం లేకుండా నేరుగా బ్యాంక్‌లో సొమ్ము వేసి నష్టపరిహారం చెల్లించామని ప్రభుత్వాలు అంటున్నాయన్నారు. గ్రామసభ జరగాలి, అక్కడ చర్చించి ప్రజలు ఆమోదించాక నిర్ణయించాలన్నారు. అయోధ్యలో రామాలయం సెంటిమెంట్ అని చెప్పుకునే పాలకులకు ఆదివాసీలకు కూడా దేవుడు వుంటాడని, వారికీ మనోభావాలు వుంటాయని తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన శ్వేతపత్రంలో ప్రజలే కాదు నది కూడా లేదని తెలిపారు. పోలవరంలో భూమికి భూమి, చెట్టుకు చెట్టు ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన మైదాన ప్రాంతాల్లోని పెద్దరైతులకు ఇచ్చినట్లు ఆదివాసీ రైతులకు ఎందుకు నష్టపరిహారం ఇవ్వరని ప్రశ్నించారు. పునరావాస ప్రక్రియలో మహిళల పట్ల తీవ్ర వివక్ష వుందన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టులోని పునరావాసంపై ఏ ప్రభుత్వానికీ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నిర్వాసితుల సమస్యలపై చర్చించాలని శాసనమండలిలో ఎన్ని పర్యాయాలు పిడిఎఫ్ పట్టుబట్టినా ఏనాడూ చర్చకు అవకాశం కల్పించలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమైనా, చంద్రబాబు ప్రభుత్వమైనా రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వాసితులను మోసం చేశాయని విమర్శించారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించేందుకు చట్టాలు వున్నా, అధికారులు ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. గిరిజనుల భూములను చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరుల పేరుమీద మార్చి నష్ట పరిహారం తీసుకుంటున్నారని, అలాంటి వాటిపట్ల అప్రమత్తంగా వుండాలని కోరారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినపుడు పునరావాసం కూడా జాతీయ అంశంగా వుండాలని అన్నారు.

ఎడతెరపిలేని వాన

- పలు జిల్లాల్లో రోజంతా వర్షపాతం
- అల్లూరి జిల్లాలో యువకుడు గల్లంతు

అల్లూరి జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న నెల్లిమెట్ల వాగు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా సోకులేరు వాగులో ఓ యువకుడు గల్లంతయ్యారు.

అల్లూరి జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రాజవొమ్మంగి మండలంలో మడేరు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, లబ్బర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం కుండపోత వర్షం కారణంగా గింజర్తి గ్రామ సమీపంలోని ఒట్టిగడ్డ వాగు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు అడుగుల ఎత్తులో ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లిమెట్ల వాగు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. చింతూరు మండలంలోని సోకులేరు వాగులో విజయవాడకు చెందిన అల్లూరి తేజ గల్లంతయ్యారు. ఆయన తన స్నేహితులతో కలిసి ఇక్కడకు వచ్చి ప్రమాదానికి గురయ్యారు. వర్షానికి రంపచోడవరం పిఎంఆర్‌సి సమీపంలోని తాటిచెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడటంతో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జికె.వీధి మండలం సీలేరులో ఆదివారం వారపు సంతకు వర్షం ఆటంకం కలిగించింది. పెదబయలు, డుంబ్రిగుడల్లోనూ వర్షం కురిసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలంలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు ప్రవహించింది. 300 ఎకరాల్లో వరినాట్లు పూర్తిగా నీటమునిగాయి. రాజానగరం, రంగంపేట, కోరుకొండ, రాజమహేంద్రవరంలో కురిసన వర్షానికి రోడ్లపైకి మోకాల్లోతు వర్షపు నీరు చేరింది. కాకినాడ జిల్లా పెద్దాపురం, గండేపల్లి, జగ్గంపేట, ప్రత్తిపాడు మండలాల్లో ఉదయం నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి.


సోకులేరు వాగులో గల్లంతైన తేజ (ఫైల్)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, రాజోలులో రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పల్నాడు జిల్లాలో 3.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అధిక వర్షాల వల్ల కొన్ని మండలాల్లో ఆకు కూరల తోటలకు, ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం కురిసింది. పలు నగరాల్లో ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం ఇంతటితో ఆగితే ముంపు సమస్య ఉండదని వరి రైతులు చెబుతున్నారు. అయితే, ఆకాశం మేఘావృతంగా ఉండటంతో ఆక్వా రైతులు తల్లడిల్లుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

చీఫ్ సెక్రటరీకి తీర్థప్రసాదాలు అందిస్తున్న జెఇఒ

శ్రీవారి సేవలో చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి- తిరుమల

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ దంపతులు ఆదివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి ఆశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, కేలండర్‌ను జెఇఒ వీరబ్రహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఇఒ గౌతమి, డిప్యూటీ ఇఒలు లోకనాథం, హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి బలోపేతంపై జనసేన దృష్టి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన జనసేన, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకునే దిశగా కసరత్తు ప్రారంభించింది. నూటికి నూరు శాతం పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించిన ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు జోష్ మీద ఉన్నారు. ఇదే సమయంలో పార్టీ శ్రేణులు, ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి ఎలా ముందుకు సాగాలనే అంశంపై పార్టీ పరంగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. ఇదే సందర్భంలో జనసేన పార్టీ తరపున గెలిచిన లోక్‌సభ, శాసనసభ, శాసనమండలికి ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో ఈ నెల 15న ఉదయం 10:30 గంటలకు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ప్రజా ప్రతినిధులకు ఆ పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దశ, దిశా నిర్దేశం చేయనున్నారు.

అంగన్‌వాడీ సమ్మె చారిత్రాత్మకం

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- '42 రోజుల సమ్మె అనుభవాలు' పుస్తకావిష్కరణ

'42 రోజుల సమ్మె అనుభవాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, నర్సింగరావు, సుబ్బరావమ్మ, ధనలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలు 42 రోజులపాటు చేసిన సమ్మె చారిత్రాత్మకమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఈ సమ్మెపై రూపొందించిన 'అంగన్‌వాడీ 42 రోజుల చారిత్రాత్మక సమ్మె అనుభవాలు' అనే పుస్తకాన్ని లక్ష్మణరావు ఆదివారం ఆవిష్కరించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు బేబిరాణి అధ్యక్షతన విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ఐక్యంగా సుదీర్ఘ పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటం ఇతర కార్మికుల్లో ఉత్సాహం నింపిందన్నారు. సమ్మె కాలంలో అంగీకరించిన అంశాలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ సమస్యలపై రాబోయే శాసనమండలి సమావేశాల్లో పిడిఎఫ్ తరపున ప్రస్తావించి చర్చకు వచ్చేలా చేస్తామని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. సుదీర్ఘంగా జరిగిన సమ్మె రాబోయే తరాలకు స్ఫూర్తి అని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడు రాజీనామా చేయాలని అంగన్‌వాడీలపై కొన్నిచోట్ల బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. సమ్మె కాలంలో అంగీకరించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, యూనియన్‌ను చర్చలకు పిలవాలని కోరారు. ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎన్‌సిహెచ్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, నాగశేషు, షీభారాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గోవిందు కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న కార్మికులు
(ఇన్‌సెట్‌లో) విద్యుత్ షాకుతో మరణించిన నక్క గోవిందు (ఫైల్)

విద్యుదాఘాతంతో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్ మృతి

- సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన
- రూ.10 లక్షల పరిహారం కోసం ప్రభుత్వానికి సిఫార్సు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కాకినాడ

విద్యుదాఘాతంతో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్ మృతి చెందిన ఘటన కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం చోటు చేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నక్కా గోవింద్ (35) కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ బ్లాక్ ఎంఆర్‌ఐ విభాగం జనరేటర్ వద్ద ఆయన విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్తు వైర్లు తగలాయి. దీంతో గోవింద్ విద్యుదాఘాతానికి గురయ్యారు. అక్కడ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆయన మృతి చెందారు. మృతునికి భార్య లక్ష్మి, కుమార్తె ప్రశాంతి, కుమారుడు ప్రేమచందు ఉన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు జిజిహెచ్ వద్ద ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం చేయకుండా అడ్డుకున్నారు. ఎఐటియుసి, టిఎన్‌టియుసి, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు వీరికి సంఘీభావం తెలిపారు. రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరతామని, ఇంటి స్థలం మంజూరు చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కాంట్రాక్టు ప్రతినిధులు నష్టపరిహారంగా రూ. మూడు లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారు. తక్షణ సాయంగా రూ. లక్షను కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని భార్యకు ఉపాధి కల్పిస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

టూరిజం హబ్‌కు ప్రత్యేక ప్రణాళిక

- త్వరలో నంద్యాలలో రిసార్ట్స్ ఏర్పాటు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కర్నూలు, అనంతపూర్ ఉమ్మడి జిల్లాలను కలుపుకొని టూరిజం హబ్‌గా చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎపి పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నంద్యాలలోని ప్రభుత్వ అతిథి గృహంలో న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌తో కలిసి ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల జిల్లాలో ఉన్న రిసార్ట్స్‌ను బలోపేతం చేయడంతోపాటు రిసార్ట్స్ లేని చోట్ల త్వరలో వాటిని నిర్మించి పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రం మొత్తంలో 20 హరిత రిసార్ట్స్ ఉన్నాయని, ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో అన్ని జిల్లాల్లోనూ టూరిజాన్ని పెంచుతామని తెలిపారు. పర్యాటక శాఖలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకు వస్తున్నారని, అలాంటి వారి సహకారంతో నంద్యాల జిల్లాను పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాదం స్కీమ్‌లను ఉపయోగించుకొని దేవాలయాల వద్ద టూరిజాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సందర్శకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అందుకు సంబంధించి దేవాదాయశాఖ, టూరిజం, ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల అధికారులను సమన్వయం చేస్తూ జిల్లాలో టెంపుల్ టూరిజాన్ని విస్తరింపజేస్తామని వెల్లడించారు. మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నంద్యాల జిల్లా అంటే గుర్తుకు వచ్చేది నవ నందులని.. పవన్ కల్యాణ్, చంద్రబాబుతో మాట్లాడి జిల్లాను టూరిజం హబ్ మారుస్తామని చెప్పారు.

ర్యాలీలో పాల్గొన్న ఉక్కు అధికారులు, కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయండి

- ఉక్కు అధికారులు, కార్మికులు ర్యాలీ, దీక్ష

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు అధికారులు, కార్మికులు ఉక్కునగరంలో ర్యాలీ నిర్వహించి దీక్ష చేపట్టారు. తొలుత స్మృత్యంజలి పార్కు వద్ద అమరవీరులకు నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో కార్మికులు, అధికారులు సహా వారి కుటుంబీకులు హాజరవడంతో ఆ ప్రాంతమంతా ఉక్కు పరిరక్షణ నినాదాలతో దద్దరిల్లింది. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కెవిడి ప్రసాద్ మాట్లాడుతూ అమృతరావు వంటి మహనీయుల కృషితో, 32 మంది ప్రాణత్యాగాలతో విశాఖ ఉక్కు ఏర్పడిన విషయాన్ని గుర్తుచేశారు. ఉత్తరాంధ్రకే తలమానికంగా ఈ కర్మాగారం నిలిచిందన్నారు. గాజువాక పరిసర ప్రాంతాలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్లాంట్ దోహదపడిందని తెలిపారు. కర్మాగారం ప్రయివేటీకరణకు కేంద్రంలోని బిజెపి చేస్తున్న కుట్రలను ఖండించారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసి ఉద్యోగులను, వారి కుటుంబాలను రక్షించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైన నేటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి మెలగాలని కోరారు. మంత్రులు, ప్రధాని, ఉక్కు అధికారులు స్టీల్‌ప్లాంట్ విషయంలో ఉన్నతంగా ఆలోచించి పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ర్యాలీ అనంతరం సి భవన్ వద్ద 12 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షఫీ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ, దీక్షకు ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు యు రామస్వామి, డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మద్దతు తెలిపారు.

జగన్ పాలనలో ప్రాజెక్టుల విధ్వంసం

- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తున్న నిమ్మల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను విధ్వంసం చేశారని, ఇప్పట్లో కోలుకోలేని విధంగా తయారు చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టులను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణతో కలిసి ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రాజెక్టులకు ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వాహణకు ఒక్క రూపాయి కేటాయించలేదని, కనీసం గ్రీస్‌కు కూడా నగదు ఇవ్వలేదని విమర్శించారు. పోలవరంతోపాటు, ఇతర ప్రాజెక్టులకు రివర్స్ టెండర్ల పేరుతో పనులు నిలిపివేశారని మండిపడ్డారు. నెల్లూరు జిల్లాకు ప్రధాన నీటి ప్రాజెక్టులైన సోమశిల, కండలేరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని తెలిపారు. సోమశిల ప్రాజెక్టు ఆఫ్రాన్ దెబ్బతినడంతో ప్రాజెక్టు ప్రమాదంలో పడిందని, దీనికి మరమ్మతులు చేయకపోతే ప్రాజెక్టు కొట్టుకుపోయే ప్రమాదముందని తెలిపారు. ఇందుకోసం రూ.80 కోట్లు అవసరమని తెలిపారు. అలాగే గేట్ల నిర్వాహణకు రూ.2.5 కోట్లు, కండలేరు కట్టమరమ్మతులకు మరో రూ.16 కోట్లు అవసరం ఉందని అధికారులు తమ దృష్టికి తెచ్చారన్నారు. 60 రోజుల్లో ఈ పనులను ప్రారంభిస్తాభించి దశల వారీగా పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని విరమించుకోవాలి

- ఆవాజ్ రాష్ట్ర సదస్సులో వక్తలు డిమాండ్

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పాలస్తీనాపై ఇజ్రాయిల్ తొమ్మిది నెలలుగా ఆక్రమణ దాడి చేస్తూ ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోందని, తక్షణమే ఆ దాడిని విరమించి పాలస్తీనా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, శాంతి నెలకొల్పాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవాజ్ ఆధ్వర్యాన పాలస్తీనా సంఘీభావ రాష్ట్ర సదస్సు ఆదివారం జరిగింది. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ సుభాన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. 75 సంవత్సరాలుగా పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ అనేక క్రూరమైన దాడులకు పూనుకుంటోందన్నారు. అమెరికా దన్ను చూసుకొని ఇప్పటికే పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించేసిందన్నారు. గాజాను సైతం ఆక్రమించేందుకు దాడులు చేస్తోందని, ఈ క్రమంలో ఇప్పటికే వేలాది మంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పౌర ఆవాసాలు, ఆస్పత్రులు, కార్యాలయాలను ధ్వంసం చేస్తోందన్నారు. ఈ దుర్మార్గ దాడిని ఐక్యరాజ్య సమితి, ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నా అమెరికా సహకారం ఉండటంతో ఇజ్రాయిల్ మరింత రెచ్చిపోతోందని తెలిపారు. ఈ ఆక్రమణ దాడిని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సంఘం రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లా చిష్టి, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ నాయకులు పి.చంద్రశేఖర్, ఎస్‌యుసిఐసి రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.ప్రమీల, సీనియర్ న్యాయవాది జాహ్నవి, టిడిపి నాయకులు షేక్ చిన్న రెహ్మాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.అయూబ్, ఎ.ఎ.అష్రఫ్, ప్రజానాట్యమండలి నాయకులు మౌలాలి పాల్గొన్నారు.

బాదల్‌షీల్ హత్యకు ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ త్రిపుర ఎఐకెఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బాదల్‌షీల్‌ను బిజెపి గూండాలు హత్య చేయడాన్ని ఆంధ్రపదేశ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ త్రిపురలో రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పనిచేస్తూ రైతు, వ్యవసాయ కార్మికుల ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉంటూ అందరి ఆదరాభిమానాలు పొందిన బాదల్‌షీల్ ఎదుగుదలను ఓర్వలేక బిజెపి గూండాలు హత్య చేశారని పేర్కొన్నారు. బిజెపి హత్యా రాజకీయాలను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని కోరారు.

తిరుమలలో మొక్కులు తీర్చుకున్న అమరావతి రైతులు

ప్రజాశక్తి- తిరుమల

అమరావతి ఉద్యమ ఆకాంక్ష నెరవేరడంతో కృతజ్ఞతయాత్ర పేరుతో అమరావతి రైతులు చేపట్టిన యాత్ర ఆదివారం తిరుమలకు చేరుకుంది. శ్రీవారి దర్శనార్థం తెల్లవారుజామున అలిపిరి నడకమార్గం ద్వారా 35 మంది రైతులు తిరుమలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వారికి సదుపాయాలు కల్పించడంతోపాటు దర్శన ఏర్పాట్లు చేశారు. అమరావతి జెఎసి కన్వీనర్ సుధాకర్‌రావుతో పాటు మహిళా రైతులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకన్న ఆశీస్సులతోపాటు రాష్ట్ర ప్రజలు కూడా తమ పట్ల దయ చూపించారని తెలిపారు. అందువల్లనే రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. గతంలో పాదయాత్ర సందర్భంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈసారి ప్రతి గ్రామంలోనూ రైతులు, ప్రజలు తమను సాదరంగా ఆహ్వానించి సారె, చీరలతో పంపించారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాజధానితో పాటు రాష్ట్ర అభివద్ధి చెందుతుందని వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కుల దురహంకారానికి పాల్పడ్డ వారిపై చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కుల దురహంకారానికి పాల్పడ్డ వారిపై చర్యలు చేపట్టాలని కెవిపిఎస్ పేర్కొంది. కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, పెన్నపేరూరులో కదిరి ప్రభాకర్ అనే దళిత వ్యక్తిపై వేడి ఆయిల్‌ను పోసి, కర్రతో కొట్టి, కులం పేరుతో ధూషించిన అగ్రకుల దురహంకారి, కిరాణా షాపు యజమాని చిన్నప్పగారి గజ్జల వెంకట సుబ్బారెడ్డిపై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసిపి భూ కబ్జాలపై 'విశాఖ ఫైల్స్'

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ కేంద్రంగా గత ఐదేళ్ల కాలంలో వైసిపి నేతలు చేసిన భూకబ్జాలపై విశాఖ ఫైల్స్ పేరిట సినిమా విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖలోని ఎంవిపి.కాలనీలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో భూకబ్జాలకు పాల్పడిన వైసిపి నేతల జాతకాలు తేలుస్తామని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా డిజైన్ చేసిన భోగాపురం, భీమిలి బీచ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అవసరమైన చోట్ల మారుస్తామని తెలిపారు. పంచ గ్రామాల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేస్తామని, నకిలీ జిఒలతో వైసిపి సోషల్ మీడియా ఈ పథకంపై తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధిదారులను గందరగోళానికి గురిచేస్తోందని తెలిపారు. విశాఖ అభివృద్ధికి భోగాపురం ఎయిర్ పోర్టు గ్రోత్ ఇంజిన్‌లా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపిందని తెలిపారు.

టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

వైసిపి హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- హిందూపురం పర్యటలో ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి ప్రభుత్వం తన హయాంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేయడంతో పాటు రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసిందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. హిందూపురం ఎంపి పార్థసారథితో కలిసి ఆదివారం ఆయన నియోజకవర్గంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించారు. బాలకృష్ణ స్వగృహంలో జిల్లా ప్రభుత్వ అస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ రోహిల్ కుమార్, ఆర్ఎంఒ డేవిడ్ రాజ్, ఇతర వైద్యులతో ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో బాలకృష్ణ మాట్లాడారు.

జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని, ఐదేళ్లలో రాష్ట్రంలో కనీస అభివృద్ధి కూడా చేయలేదని విమర్శించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలని అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో చిన్న చిన్న మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందిచాల్సి ఉంటే కనీస సౌకర్యాలు కల్పించకుండా వాటిని సైతం నిరుపయోగం చేసిందన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఆరు నెలల్లో టిడ్కోగృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, ట్రాన్స్‌కో డిఇఇ భూపతి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిపిఎస్ మోసపూరితం

- రద్దుకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- రేపు, ఎల్లుండి నిరసనలకు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్) చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ చేశాయి. పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేయాలని ఆయా సంఘాలు ఆదివారం విడివిడిగా ప్రకటనలు విడుదల చేశాయి. జిపిఎస్ గెజిట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ మంగళ, బుధవారాల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలిపారు.

చట్టం చేయడం దారుణం : ఆప్టా

జిపిఎస్ అమలు తేదీ ప్రకటించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు తెలిపారు. ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు విషయాన్ని పరిశీలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని అన్నారు. ఉద్యోగుల్లో అశాంతి ఏర్పడక ముందే జిపిఎస్ చట్టాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ అడుగు జాడల్లో ప్రస్తుత ప్రభుత్వం నడవడం సరికాదన్నారు.

ఒపిఎస్‌ను కోరుతున్న ఉద్యోగులు : బిటిఎ

ఉద్యోగులు ఒపిఎస్ కోరుతున్నారని, జిపిఎస్ కాదని బహుజన టీచర్స్ అసోసియేన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి మనోజ్‌కుమార్, చిట్టేటి రమేష్ అన్నారు. జిపిఎస్ విధానానికి విడుదల చేసిన జిఒ 54ను రద్దు చేయకుండా అమలు చేసేందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. తమతో కనీసం చర్చించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం టిడిపి కూటమికి తగదన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాల్సిందే

- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ముందు రోజే దొడ్డిదారిన జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. గత ఆర్థిక శాఖ కమిషనర్ రావత్ జిఒ 54 ద్వారా జిపిఎస్‌పై ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సుందరయ్య భవనంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించిందని, పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా జిఒను నిలిపివేసిందని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్న జిపిఎస్‌ను ప్రస్తుత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను కొనసాగించాలని, 1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులను, ఐటిడిఎ సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో శత శాతం పండిట్ పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే, యుటిఎఫ్ సంఘం రాష్ట్ర స్వర్ణోత్సవ సభలు ఈ ఏడాది డిసెంబర్ 14, 15, 17 తేదీల్లో కాకినాడలో జరగనున్నాయని, ఈ సభలకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి ఆహ్వానం పలకనున్నట్లు తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహనరావు, ఎస్.కిషోర్ కుమార్, ఆర్.మోహనరావు, బి.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ఎస్ ప్రసాద్

అంబులెన్స్ బహూకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర మాజీ మంత్రి పర్వతనేని ఉపేంద్ర 88వ జయంతి సందర్భంగా పర్వతనేని ఫౌండేషన్ తరపున ఆయన తనయుడు పర్వతనేని వివేక్ ఆనంద్ అంబులెన్స్‌ను ప్రభుత్వానికి బహూకరించారు. ఉండవల్లిలోని సిఎం నివాసంలో అంబులెన్స్‌ను సిఎం చంద్రబాబు చేతుల మీదుగా పర్వతనేని ఫౌండేషన్-లుగాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా అంబులెన్స్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. టిడిపి ఆవిర్భావ సమయంలో ఉపేంద్ర పార్టీ జనరల్ సెక్రటరీగా పనిచేశారని, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ ఆనంద్‌ను ఆయన అభినందించారు. క్రిటికల్ కేర్ వైద్యంలో ఈ అంబులెన్స్ కీలకంగా పనిచేస్తుందని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

రామకృష్ణ మృతి పట్ల సిఎం సంతాపం

ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన టిడిపి నాయకులు అన్నె రామకృష్ణ మృతి పట్ల టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ హఠాన్మరణం తనను షాక్‌కు గురిచేసిందన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపిలో కీలకమైన ఓటరు వెరిఫికేషన్ విభాగంలో రామకృష్ణ ఎంతో క్రియాశీలకంగా, సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. ఆయన్ను అందరూ ఓటరు రామకృష్ణగా పిలిచేవారని, ఆయన కుటుంబ సభ్యులకు సిఎం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మహిళా సాధికారతకు కృషి

- మంత్రి లోకేష్‌తో ఆర్‌డిటి మాంచో ఫెర్రర్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారతకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) ఎంతో కృషి చేస్తోందని ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో మంత్రి నారా లోకేష్‌తో ఆర్‌డిటి నిర్వాహకులు మాంచో ఫెర్రర్ ఆదివారం భేటీ అయ్యారు. యువగళం పాదయాత్రలో ఆర్‌డిటి కార్యాలయాన్ని సందర్శించిన లోకేష్ టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే సేవలు విస్తరించే విధంగా కలిసి పనిచేద్దామని ప్రతిపాదించిన నేపథ్యంలో నిర్వాహకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 1969లో విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఇప్పటికీ ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో 3 వేల గ్రామాల్లో అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. రూ.వేల కోట్ల ఖర్చుతో రెండు రాష్ట్రాల్లోని పల్లెల్లో ఆస్పత్రుల నిర్మాణం, పేదలకు ఆర్థిక సహాయం, ఇళ్ల నిర్మాణం, విద్య, వైద్యం, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించిన ఆర్‌డిటి.. ప్రభుత్వానికి సమాంతరంగా ప్రజలకు సేవలందిస్తోందని లోకేష్ ప్రశంసించారు. ఉపాధి కల్పన, స్వయం ఉపాధి, మహిళా సాధికారత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పడం ద్వారా ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు వంటి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారం అందించాలని మంత్రి కోరారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రభుత్వంతో కలిసి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, సేవ, మౌలిక సదుపాయాల కల్పన కోసం కలిసి పనిచేద్దామన్నారు.

పసికందుపై దారుణం

వరుసకు తాతయ్య అయ్యే వ్యక్తి ఘోర అఘాయిత్యం

ప్రజాశక్తి- రామభద్రపురం, విజయనగరం కోట

ముక్కుపచ్చలారని పసికందుపై ఓ మానవ మృగం దారుణానికి ఒడిగట్టింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ఆరు నెలల శిశువుపై వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం కొండకెంగువ పంచాయతీ జీలికవలస గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వివరాలను బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆదివారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... జీలికవలస గ్రామానికి చెందిన దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. తండ్రి వలస కార్మికుడు. కూలి పనులకు గుంటూరు వెళ్లారు. శనివారం సాయంత్రం పది, మూడేళ్ల ప్రాయంలో ఉన్న పిల్లలకు తల్లి అల్పాహారం అందించి, ఆరు నెలల పాపాయిని ఉయ్యాల్లో ఉంచారు. సరుకుల బండి రావడంతో కొనేందుకు ఆమె బయటకు వెళ్లారు. ఇంతలో ఆమెకు వరసకు చిన్నాన్న అయ్యే నేరెళ్లవలసకు చెందిన బోయిన ఎరకన్నదొర ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. ఉయ్యాల్లో నిద్రపోతున్న పసికందుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఒక్కసారిగా గట్టిగా ఏడవడంతో పెద్ద పాపను ఆ తల్లి పంపించి చెల్లిని సముదాయించమని చెప్పింది. ఆ పాప వచ్చి చూసేసరికి నిందితుడి చేతుల్లో ఉన్న చిన్నారి ప్రయివేటు భాగం నుంచి రక్తం రావడం గమనించి తల్లికి చెప్పింది. ఆమె హుటాహుటిన లోపలికి వచ్చి, పక్కనే ఉన్న కర్రతో మోదడంతో మద్యం మత్తులో ఉన్న నిందితుడు ఆ చిన్నారిని వదిలేసి బయటకు పరుగు తీశాడు. స్థానికులతో కలిసి ఆ తల్లి రామభద్రపురం పోలీస్ స్టేషనుకు వచ్చి ఈ ఘోరంపై ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. బాధిత పసికందును బాడంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవల కోసం విజయనగరంలోని ఘోషాస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నారి కోలుకుంటోంది.

నిందితుడు అరెస్టు, 14 రోజులు రిమాండ్

ఘటన జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారైన నిందితుడు ఎరకన్నదొరను ఆదివారం ఆయన స్వగ్రామం నేరెళ్లవలసలో పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై పోక్సో, బిఎన్ఎస్ కేసులు నమోదు చేసినట్లు డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. రామభద్రపురం పోలీస్ స్టేషన్లో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. అనంతరం పార్వతీపురం కోర్టులో హాజరు పర్చారు. ఎరకన్నదొరకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

ఘోషాస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

చిన్నారి కుటుంబానికి మంత్రుల పరామర్శ

ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, విజయనగరం, బొబ్బిలి ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, బేబినాయన పరిశీలించారు. చిన్నారి తల్లిని పరామర్శించారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మంత్రులు ఆదేశించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, నిందితుడికి త్వరగా శిక్ష పడేలా చూస్తామని మంత్రి సంధ్యారాణి చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఐద్వా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి పరిశీలించారు. చిన్నారి తల్లిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వెల్లువెత్తిన ఆగ్రహం

పసికందుపై అఘాయిత్యం ఘటనపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ఐద్వా ఆధ్వర్యాన ధర్నా

రామభద్రపురం సచివాలయం వద్ద ఐద్వా ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఎస్‌పి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుంకర రాజేంద్ర ప్రసాద్

ప్రశ్నించే వారిని హింసించడమే నూతన క్రిమినల్ చట్టాల లక్ష్యం

- 'ఐలు' జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిని హింసించే విధంగా నూతన క్రిమినల్ చట్టాలు ఉన్నాయని ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు, ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై నెల్లూరు జిల్లా డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐలు జిల్లా అధ్యక్షుడు న్యాయవాది ఎస్ అంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు సుంకర రాజేంద్ర ప్రసాద్ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిని హింసించడానికి కొత్త క్రిమినల్ చట్టాలు ఉపయోపడే విధంగా ఉన్నాయని విమర్శించారు. జ్యుడీషియల్ అధికారాలను తగ్గించి పోలీసు శాఖకు అధికారాలు అప్పగించే తరహాలో నూతన క్రిమినల్ చట్టాలున్నాయన్నారు. వలసవాదుల చట్టాలకంటే క్రూరంగా ఉన్నాయని, బెయిల్ మార్గదర్శకాలు, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించేలా ఉన్నాయని తెలిపారు. ఆయా చట్టాల వల్ల న్యాయం మరింత ఆలస్యమయ్యే అవకాశముందన్నారు. యువ న్యాయవాదులు ప్రస్తుతం ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. విలువలు పాటించేలా, సమాజం కోసం మాట్లాడే న్యాయవాదులుగా తయారుకావాలని కోరారు. న్యాయస్థానాల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని, కోర్టుల సంఖ్య, న్యాయమూర్తుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు హాజరైన న్యాయవాదులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పలు అంశాలపై చర్చించారు. నూతన క్రిమినల్ చట్టాలపై మరింత లోతైన పరిశీలన అవసరముందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రజల హక్కులు కాలరాసేలా ఉన్న అంశాలను తొలగించే వరకు ఉద్యమించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా కార్యదర్శి చుక్కా రమేష్ , సీనియర్ న్యాయవాది అబ్బాయి రెడ్డి, ఐలు నాయకులు వై విజయ్ మోహన్ రెడ్డి, గుంజి దయాకర్, సుబ్రమణ్యం తదితరుల పాల్గొన్నారు.

తమకు టీచర్‌ను కేటాయించాలని స్కూలు షెడ్డు వద్ద వేడుకుంటున్న విద్యార్థులు

స్కూల్ షెడ్డు వేసుకున్నాం.. టీచర్‌ను పంపండి సారూ..

- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

'గ్రామంలో అందరం కలిసి చందాలు వేసుకుని స్కూల్ షెడ్డు కట్టుకున్నాం. టీచర్‌ను పంపించండి సారూ..' అని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ టెంకలబంద గ్రామస్తులు, అక్కడి విద్యార్థులు వేడుకుంటున్నారు. శనివారం షెడ్డు వద్దే వారంతా నేలపై మోకరిల్లి దండం పెడుతూ తమ ఆవేదనను వెళ్లగక్కారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాండవుల సత్యారావు, గ్రామస్తులు వెంకటరావు, కొండబాబు మాట్లాడుతూ.. గ్రామంలో 28 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఆ కుటుంబాల్లోని 25 మంది పిల్లలు రెండు గెడ్డలు దాటి ప్రతిరోజూ పి.గంగవరంలో ఉన్న పాఠశాలకు చదువుకునేందుకు వెళ్తున్నారన్నారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గెడ్డలు దాటలేకపోతున్నారని ఆవేదన వ్యకం చేశారు. ఇప్పటికే కలెక్టర్‌కు సమస్యను తెలపగా ఆయన ఆదేశాల మేరకు ఎంఇఒ తమ గ్రామానికి వచ్చారన్నారు. పాఠశాల షెడ్డు ఏర్పాటు చేసుకుంటే టీచర్‌ను పంపిస్తామని చెప్పడంతో గ్రామస్తులంతా రూ.500 చొప్పున చందాలు వేసుకుని ఏడు రోజుల పాటు షెడ్డును నిర్మించినట్టు తెలిపారు. అయితే, ఇప్పటికీ టీచర్‌ను కేటాయించలేదని వాపోయారు. తమ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మందు వికటించి మహిళ మృతి

ప్రజాశక్తి - తనకల్లు (శ్రీసత్యసాయి జిల్లా)

సూదిమందు వికటించి మహిళ మృతిచెందిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ ఎస్‌సి కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కొక్కంటి క్రాస్ ఎస్‌సి కాలనీకి చెందిన ఉత్తమ్మ (50)కు వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఆమె కొక్కంటిక్రాస్‌లో ఆర్ఎంపి అబ్దుల్లా క్లీనిక్‌కు ఆదివారం వెళ్లారు. చికిత్స నిమిత్తం ఉత్తమ్మకు అబ్దుల్లా సూదిమందు ఇచ్చారు. వెంటనే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు అక్కడి వైద్యులు ప్రకటించారు. ఉత్తమ్మ మృతికి కారణమైన ఆర్ఎంపిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

यूनियन बैंक ऑफ इंडिया — భారత సర్కార్ का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఎనికేపాడు బ్రాంచి : ఎ టి & పోస్టు, ఎనికేపాడు, వయా రామవరప్పాడు, విజయవాడ, కృష్ణా జిల్లా, ఎపి-521108

NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత : 1) శ్రీమతి కె. శాంతకుమారి, భర్త : శ్రీ కె. గణేష్, ఎఫ్.ఓ.ఎఫ్-1, 4వ అంతస్తు, హర్షిత ఎన్‌క్లేవ్, రామ్ నగర్, రామాలయం గుడి దగ్గర, నిడమానూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా - 521104.

నేచర్ ఆఫ్ లిమిట్	అమౌంట్ (రూ. లక్షల్లో)	ది. 01-06-2024 నాటికి బకాయి మొత్తము (రూ.)
Housing Loan 329806650005968	Rs. 23,20,000/-	Rs. 30,95,155.62/-

ప్రాథమిక హామీ : శ్రీమతి కొప్పుల శాంతకుమారి గారి పేరిట విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, రామాలయం గుడి దగ్గర, ఆర్.ఎస్.నెం. 119/2బి వద్ద గల 'హర్షిత ఎన్‌క్లేవ్' పేరుతో గల గ్రూప్ హౌస్ నందు ప్లింత్ ఏరియా 870.0 చ॥అ॥లు, కామన్ ఏరియా 50 చ॥అ॥లు, పార్కింగ్ ఏరియా 20 చ॥అ॥లతో నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. ఎఫ్.ఓ.ఎఫ్-1కి చెందిన నివాస ఫ్లాట్ మరియు దానికి చెందిన సాధారణ వినియోగాలైన వాటర్, డ్రైనేజీ, దారి మరియు మెట్లు మొ॥వాటితో సహా. **హద్దులు : తూర్పు :** మెట్లు, కామన్ కారిడార్ మరియు లిఫ్ట్, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** శూన్యాకాశము, **ఉత్తరం :** శూన్యాకాశము. ఈ ఆస్తి శ్రీమతి కొప్పుల శాంతకుమారి గారిపేరిట ఉన్నది.

అమ్మా / అయ్యా,
విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **హౌసింగ్ లోన్ ల క్రింద మా ఎనికేపాడు బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ **ఖాతాను ది. 29-05-2024 న నిరర్థక ఆస్తిగా (NPA)** వర్గీకరించ బడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుప బడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 02-07-2024 **సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

గోదావరి వరదలపై ముందస్తు అంచనాతో సహాయక చర్యలు

- కుటుంబానికి 200 రోజుల 'ఉపాధి'
- రైతు, వ్యకాస, కౌలు రైతు సంఘాలు, డిమాండ్
- మంత్రి అచ్చెన్నాయుడుకు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి ఏడాదీ జులైలో గోదావరికి వరదలు రావడం సహజమని, వరదల స్థాయిని ముందస్తుగా అంచనా వేసి తగినవిధంగా సహాయక, పునరావాస చర్యలు చేపట్టాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.300 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షకార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షకార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు ఉమ్మడిగా ఒక లేఖ రాశారు. గోదావరికి వరదల సమయంలో ప్రజలకు అవసరమైన బియ్యం, పప్పులు, నూనెలు వంటి ఆహార సరుకులు 3 నెలలకు సరిపడా జులైలోనే ఎత్తయిన ప్రాంతాల్లో నిల్వ ఉంచాలని, అన్ని కుటుంబాలకు సరిపడా టెంట్లు తదితర అవసరమైన వాటిని సమకూర్చాలని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తక్షణమే అమలు చేయాలని, పోలవరం నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిజనుల పునరావాసానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పునరావాసం తరువాతనే ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవాలన్నారు. కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలేనని, తక్షణమే ఆ లెక్కలను రద్దు చేసి నిర్వాసితులందరికీ ఒకేసారి పరిహారం అందించాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు 4 రెట్లు అదనంగా పరిహారం ఇవ్వాలని, ఆవాసాలకు, పశువులకు, చెట్లకు పరిహారం ఇవ్వాలని, రవాణాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గిరిజనులకు భూమికి భూమి అనే విధానాన్ని అమలు చేయాలని, వ్యవసాయానికి అనువైన భూములు ఇవ్వాలని, సురక్షిత ప్రాంతాల్లోనే పునరావాస కాలనీలు నిర్మించాలని, వ్యవసాయానికి అనువైన భూములు ఇవ్వాలని అన్నారు. పునరావాస కాలనీల్లో ఇళ్లను నాణ్యంగా నిర్మించాలని, రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు, విద్యుత్తు సరఫరా, పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తేయాలి

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - సోంపేట (శ్రీకాకుళం జిల్లా)

పర్యావరణ పరిరక్షణ, బీల భూములను కాపాడుకోవడం కోసం రైతులు సాగించిన సోంపేట థర్మల్ ఉద్యమం ఉద్యమాలకే ఆదర్శంగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. ఈ పోరాటం సాగించిన ఉద్యమకారులపై ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తేయాలని, బీల భూములను సురక్షిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని సోంపేట థర్మల్ కాల్పుల ఘటనకు 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పోరాటంలో అమరులైన ముగ్గురు అమరులకు అమరవీరుల స్తూపం వద్ద పర్యావరణ పరిరక్షణ సమితి, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యాన ఆదివారం నివాళులర్పించారు.

అమరుల స్తూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

అనంతరం స్థానిక కళాసీ సంఘ భవనం వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు వై.కృష్ణమూర్తి, మానవ హక్కుల వేదిక నాయకులు వి.ఎస్ కృష్ణ మాట్లాడుతూ బీల భూముల్లో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయకుండా ఈ ప్రాంత ప్రజలు చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిందన్నారు. ప్రజల పోరాట ఫలితంగా ప్లాంట్ రద్దయిందని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజల మనుగడ, భావితరాల భవిష్యత్ కోసం పోరాటంలో అమరులైన రైతుల త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్ తరాల కోసం అందరూ ఒక్కటై సాగించిన ఈ ఉద్యమం చిరస్థాయిగా స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు పి.శివాజీ, ఎస్.రామారావు, మడే శరత్చంద్రుడు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు సూరాడ చంద్రమోహన్, బి.సత్యనారాయణ, దాసరి రాజు, కూన రాము, మానవ హక్కుల వేదిక నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణమున్న కట్టెల గురించి ...

3BHK ఇల్లూ విల్లాలకు హక్కుదారులై
కారు టైరు కింద తారురోడ్డులా
కులం పడగల మతం పామును
మట్టికరిపించినోళ్ల గురించి కాదు గానీ –

ఎన్నో యుగాల శిథిల చట్రాల్లాంటి
ఇరుకిళ్ళలో మురికివాడల్లో
తడికలూ పరదాలూ కప్పక తప్పని
కాలనీ గుడిసెల్లో
గుమ్మంలోంచి మతం గొయ్యి చిమ్మే బురద
ఇలకాతల కులం పొయ్యి కమ్మే పొగ
రాజుకునే కళ్ళమంటల మధ్య బొగ్గులయ్యే
ప్రాణమున్న కట్టెల గురించి –
ఇప్పుడు చర్చించాలి!

దాకపెంకుల్లో గొంతు తడిపిన మంచినీళ్ళ
కొబ్బరి చిప్పల్లో ఊది తాగిన డికిసిన్ నీళ్ల
పేట పైటల పొత్తి కడుపుల దిగువున
మోతుబరి మీసాల దౌష్ట్యపు చూపులు
పనిలోకెళ్ళిన ప్రతి చోటా
ఆనాడు పడిన అవమానాలు..
ఇప్పటి కథా నేపథ్యం మారిందేమో తప్ప
కథ మారలేదు
నాటి కన్నీటి లిపి ఈనాటికీ
విముక్తి వ్యాకరణమై వెలగలేదు!

అయ్యా! ఉద్యోగాలు కావాలి
ఊరిలో చెరువు పని చేసుకో... అదే ఉపాధి!
అయ్యా! అప్పైనా పుట్టడం లేదు
ప్రభుత్వమిచ్చిన డి–పట్టా ఉందిగా
అసైన్డ్ భూమైనా అమ్ముకోనిస్తాం చాలదూ!
అయ్యా! అధికార పదవులేవీ లేవా మాకు?–
నాయకత్వ స్థానాలన్నీ అగ్రవర్ణాలకే
అంకితమిచ్చాం
కావాలంటే వాటికి పక్కవాద్యం మాత్రం మీకే!

కుర్చీల్లో బిలియనీర్లు పీఠాల మీద బాబాలూ
వారి మాయా మహిమల పాదధూళి కోసం
తొక్కిసలాడుకుని ఊపిరొదిలే
అమాయకుల వెర్రితనాలు
అయ్యా! వొద్దొద్దు మీ మోచేతి నీళ్ళు
మీకు రక్షణ కవచాలైపోయిన
మతపీఠాల్నీ కులం కుర్చీల్నీ మడతపెట్టి
విజ్ఞానపు మంటల్లో కాల్చి పడేస్తే తప్ప
వివక్షల మనుమృగం వేట మానదు
గబ్బిలం విముక్తి కల నెరవేరదు!

– కంచరాన భుజంగరావు
94415 89602

ఏ స్లేవ్ డీలర్

మొదటిగా ఏ వయసులో
పరుగు మొదలెట్టామో తెలియదు
ఎందుకు మొదలెట్టామో తెలియదు
ఇప్పటికీ పరుగెడుతునే వున్నాం
నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు
పరుగెడుతూనే వుండాలి
చప్పటి జీవితంలో
ఉప్పు కోసం పరుగు
ఉడికే పప్పు కోసం పరుగు
తడారిన గొంతులోకి
నీళ్ల కోసం పరుగు
మరిగే డికాషన్‌లో
పాల కోసం పరుగు
ఆగేందుకు వీలులేదు
అలుపు తీర్చుకునేందుకు వీలులేదు
ఇంటి పని... వంట పని అంటూ
భార్యను పరిగెత్తించాలి
బాగా చదువుకుంటే
రేపు మీరే బాగుపడతారంటూ ర్యాంకుల కోసమై
పిల్లలను పరిగెత్తించాలి
మనం పరిగెత్తడమే కాదు
'స్లేవ్ డీలరు'లా
మనతోపాటు మన వాళ్ళను
పరిగెత్తించే బాధ్యత కూడా మనదే
ఆగేందుకు వీల్లేదు
ఆగి ఓ అందమైన పువ్వును
చూసేందుకు వీల్లేదు
కమ్మని వాసన పీల్చేందుకు వీల్లేదు
కంటినిండా నిద్రపోయేందుకు వీల్లేదు
పరుగెత్తాల్సిందే
ఎవరు కాస్త ఆగాలని చూసినా
వేరొకరి కాళ్ళ కింద పడి చావాల్సిందే
చావు నుంచి తప్పించుకోవడానికై పరిగెత్తాలి
పరిగెత్తి... పరిగెత్తి చావాలి
ఎవరికీ ఆగేందుకు వీల్లేదు
ఆగి అలుపు తీర్చుకునేందుకు వీల్లేదు
పరుగెత్తాల్సిందే!

– మొయిద శ్రీనివాసరావు
99082 56267

నిమిత్త మాత్రుడు

అందరికీ
అన్నం పెట్టలేక ఆ దేవ దేవుడు
రైతును సృష్టించుకున్నాడు!
అతను బతికున్నంత కాలం
సమస్త జీవ రాశులకూ
మనకూ ఏ చావు లేదు!

అవని అలవోకగా అతనికి
మట్టికి నీళ్ళు తాపి
బంగారం చేసే విద్యను నేర్పింది!
మట్టికీ ఆ మనిషికీ
అనుబంధం తెగనంత కాలం
ఉపద్రవాలెన్నొచ్చినా భయం లేదు!

రాజ్యం
తన ఉనికికి భంగం కలిగితే
రైతే ఈ దేశం వెన్నెముకని కీర్తిస్తది!
అన్నం పెట్టిన చేతులకు
సబ్సిడీల తైలం రాసి
ఇది రైతు ప్రభుత్వమని ప్రకటిస్తది!

అతను
దూషణ భూషణ పట్టింపులు లేక
నాగేటి చాలల్లో దీపాలు వెలిగిస్తాడు!
కృషీవలుడు ఎప్పటికీ
ఈ వ్యవసాయ దేశంలో
నిద్ర సుఖమెరగని నిమిత్త మాత్రుడే!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

కొన్ని పుస్తకాలు పైపైన చదవాలి. కొన్నింటిని నిశితంగా పరిశీలించి మరీ చదవాలి. కొన్నింటిని నిశితంగా శ్రద్ధగా చదవడంతో పాటు జీర్ణించుకోవాలి.

- ప్రఖ్యాత రచయిత బేకన్

కవిత్వంగా రూపుదాల్చిన దైనందిన జీవితం

పుస్తకం

ప్రతి మనిషిలోనూ ఒక కవి ఉంటాడు. అయితే ఆ కవి ఎప్పుడు ఎలా బయట పడతాడనేది చెప్పలేం. అది ఏ వయసులోనైనా కావొచ్చు. ఏ సమయంలోనైనా కావొచ్చు. కాని అలా బయట పడాలంటే ఆ వ్యక్తిపై చిన్నప్పుడు తల్లిదండ్రుల ప్రభావమో లేదా గురువుల ప్రభావమో ఉండాలి. కొంచెం ఎదిగాకా స్నేహితుల ప్రభావమో, పుస్తకాల ప్రభావమో ఉండాలి. ఇవేవీ కాకుండా, పరిసరాల ప్రభావమైనా ప్రగాఢంగా ఉండాలి. ఇటీవల "నా డైరీ కనిపించటం లేదు" పేరుతో సిహెచ్.మంజుల వెలువరించిన కవితా సంపుటిలో వీటన్నిటి ప్రభావమూ కనిపిస్తుంది. ఆమె కవిత్వాన్ని ఒక కవితా సంపుటిగా తీసుకురావటంలో మాత్రం సాహితీ స్రవంతి పెద్దాపురం శాఖ ప్రభావం ప్రగాఢంగా ఉంది.

స్త్రీల కవిత్వం, ఉంటే చాలా పదునుగా వాడిగా, వేడిగా ఉంటుంది. లేదా ఎంతో సున్నితంగా, మార్దవంగా, ఆర్ద్రంగా ఉంటుంది. మంజుల గారి కవిత్వం ఇందులో రెండవ కోవకు చెందిన కవిత్వంలా అనిపిస్తుంది. స్త్రీవాద కవిత్వం ఉప్పెనలా ఎగసిపడ్డాక, తదనంతర స్త్రీల కవిత్వంలో కొంత ఈ ధోరణి కనిపిస్తుంది.

మనసు మోయలేని వేదనతో పరితపిస్తున్నప్పుడో, అంతులేని ఆనందానికి చేరువైనపుడో కవిత్వం ఉబికి వస్తుంది. ఇది నా మాట కాదు. రచయిత్రి తొలి కవితలోనే 'తన కవిత్వాన్ని గుండె చెమ్మగిలచేసిన ఒకానొక విషాద గీతిక' అంటారు. అంతటితో ఆగకుండా 'నా కవిత ఏ వేకువ జామునో నాపై కురిసిన ఓ వెలుతురు చినుకు' అని కూడా అంటారు. అంటే ఆనంద విషాదాల సమ్మేళనమే కవిత్వమని అర్థమవుతుంది.

ఇందులో మొత్తం 45 కవితలున్నాయి. అన్నీ రచయిత్రి జీవన గమనంలో ఎదురయ్యే అంశాలే. కవిత్వం ఇలా ఉండాలి అని సమగ్రమైన నిర్వచనాన్ని ఎవ్వరూ ఇవ్వలేరు. ఇచ్చినా అందులో అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు లేకుండా ఉండవు. కవిత్వానికి ఉపదేశమా? ఆనందమా? ఏది ప్రధానం? అన్న విషయంలోనూ నిక్కచ్చిగా ఇదని నిగ్గు తేల్చలేం. కవిత్వంలో చైతన్యం, తిరుగుబాటు, మంచి మెసేజ్ ఇవి మాత్రమే కాదు; కొన్ని ఇతరేతరమైన ఫీలింగ్సూ ఉండాలి. ఉంటాయి.

రచయిత్రి ఒక ఉపాధ్యాయిని. ఎన్నో కవితా వస్తువులు ఈమె కవితల్లో ఒదిగిపోయాయి. అమ్మ, నాన్న, రావిచెట్టు, మా ఊరి చెరువు, హాస్టల్‌గేట్, వేపచెట్టు, ఐసుబండి, పూలబ్బాయ్, కరివేపాకు చెట్టు– ఇలా నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ అంశాలే ఈమె కవితా వస్తువులయ్యాయి. నాలుగు వీధుల కూడలిలో ఉన్న వేపచెట్టును గురించి వర్ణిస్తూ 'ఆవకాయ దగ్గర్నుంచి – అమెరికా దాష్టీకం దాకా' ఆ చెట్టు నీడనే చర్చకొస్తాయంటారు. పల్లెటూళ్ళలో కూడలిలో ఉండే చెట్టునీడన కనిపించే ఎన్నో దృశ్యాల్ని కళ్ళకు కట్టారు ఈ కవితలో.

కొన్ని స్వయంగా అనుభూతిస్తేగాని కవిత్వం పుట్టదు. ఒకవేళ పుట్టినా అది అంత బలంగా ఉండదు. 'ఆమె మహిళా ఉద్యోగిని' అనే కవితలో రచయిత్రి ప్రారంభ ముగింపులలో చక్కని ప్రతీకల్ని ప్రయోగించారు. ఉదయించిన సూర్యునిలా ఇంటి నుంచి బయలుదేరిన ఆమె సాయంత్రానికి జాబిలమ్మై తన ఇంట ప్రకాశిస్తుందంటారు. మామూలుగా ఇతర కవులైతే పడమట గ్రుంకే సూర్యునిలా అనో, కాంతిని కోల్పోయిన భానునిలా అనో వర్ణిస్తారు. కానీ ఈమెది పాజిటివ్ థింకింగ్. అందుకే జాబిలమ్మై ప్రకాశించినట్లుగా పోలుస్తారు.

రచయిత్రి వ్యవసాయ రైతు కుటుంబానికి చెందిన స్త్రీమూర్తి. రైతు వ్యథలు తెలుసు, కౌలురైతు కష్టాలూ తెలుసు. వాటిని కళ్ళతో చూసి, మనసుతో అర్థం చేసుకొన్న ఆమె. పిల్లల కోరికపై పొలం చూడటానికి వెళ్ళిన ఆ దంపతులకు ఎంతో ఆదరంగా వండి వడ్డించిన కౌలురైతు ఆత్మీయత మనసును కదిలిస్తుంది. అలా తమ కడుపు నింపిన ఆ కౌలురైతు కుప్పగా పోసిన ధాన్యపు రాశిలా కవయిత్రికి గోచరిస్తాడు. అంతే కాదు; ఎటువంటి భేషజం లేకుండా ఆ రైతును కౌగలించుకొన్న ఆమె భర్త 'అన్నం ముద్దను ఆలింగనం చేసుకొన్నట్లు'గా అనుభూతి చెందుతాడు. రైతు పట్ల రచయిత్రికి ఉన్న సానుభూతి ఈ కవితలోని అక్షరమక్షరంలోనూ వ్యక్తమవుతుంది.

'బిచ్చగత్తె' కవితలో రచయిత్రి బిచ్చగాళ్ళను హేళన చేసే వారితో సహానుభూతిని పొందుతుంది. కాని రచయిత్రి మాత్రం అలాంటిది కాదు. 'కష్టపడి బతకొచ్చుగా' అంటూ బిచ్చగత్తెను ఎద్దేవా చేసిన ఆమెను మరెప్పుడూ బిచ్చగత్తె యాచించదు. ఆమె పక్కనున్న వాళ్ళను యాచిస్తూంటుంది గాని ఆమెను మాత్రం అడగదు. అడుగుతుందేమో ఇద్దాంలే అనుకొన్నా ఆ బిచ్చగత్తె ఆమెనస్సలు ఎప్పుడూ అడగదు. ఆ విషయాన్నే కవిత్వీకరిస్తూ...

నాలోని నిర్దయను నిరసించినట్లుగా
ఆమె నన్ను అడగనేలేదు
ఆ బిచ్చగత్తె నన్ను వెలివేసిందా!' అని

భావిస్తుంది. బిచ్చగాళ్ళను తేలిక చేసి మాట్లాడేవాళ్ళకు ఈ కవిత ఒక పదునైన చురక. అయితే ఒంట్లోశక్తి ఉన్నా అడుక్కోవటానికి అలవాటు పడి, ఆ డబ్బుతో బిర్యానీ పేక్ చేయించుకొని వెళ్ళే బద్ధకస్తుల్ని మరో కవితలో నిరసిస్తారు రచయిత్రి. 'ఇక్కడ స్త్రీలు పూజింపబడరు' అనే కవితలో కడుపులో పడినది మొదలుగా స్త్రీ ఎదుర్కొనే కష్టాల్ని, వ్యథల్ని వివరిస్తారు రచయిత్రి. మొన్న నిర్భయ, తర్వాత అయేషా, ఆపై ఓ బుడిబుడి నడకల చిన్నారి – ఇలా ఎందరు, మానవ మృగాల అకృత్యాలకు బలైపోతున్నా న్యాయం జరగదు, శిక్షపడదు, మరేం జరుగుతుందంటే ...

'ఏముంది
కొన్ని కొవ్వొత్తులు అమ్ముడవుతాయి
టీవీ చానళ్ళ రేటింగులు పెరుగుతాయి
మళ్ళీ అందరం/ ఎవరిదైనందిన జీవితాల్లో వాళ్ళు' – అంటూ లోకరీతిని, యథార్థ తత్వాన్ని వివరిస్తారు.

మా 'ఊరి చెరువు' కవితలో రచయిత్రి ఆ చెరువు తన కెన్నివిధాలుగా గోచరిస్తుందో వర్ణిస్తారు. ఆ చెరువును చూస్తే బాల్యమిత్రుని చూసినట్లుగా ఉంటుందంటారు. తనను చూడగానే ఆ చెరువు కూడా ఆనందంగా

'సిగలో తామరులు తురుముకొని
అలల కుచ్చెళ్ళు సర్దుకొని
అందంగా ముస్తాబై – ఎదురు

వస్తుందంటారు. అంతేకాదు ఏవో సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నవారికి కూడా

'నడివేసవి వడగాలికి/ ఎండి బీటలు వారినా
రాబోయే వర్షాకాలం కోసం
ఆశగా ఎదురుచూస్తున్న
తనను చూసి స్ఫూర్తిపొందమని' –

బోధిస్తుందట. అందుకే మా ఊరి చెరువంటే నాకంత ఇష్టం అంటారు. రచయిత్రి మానవ సంబంధాలకెంతో ప్రాధాన్యతనిస్తారు. 'అమ్మ, మా యింటి అక్షయపాత్ర' అనే సుదీర్ఘ కవితలో, భర్త కోసం, పిల్లల కోసం, వచ్చి– పోయే అతిథి అభ్యాగతుల కోసం అమ్మ అవిశ్రాంతంగా ఒక యంత్రంలా ఎలా టైమ్ ప్రకారం పనిచేసుకొంటూ పోతుందో వివరిస్తారు. అమ్మ కష్టాన్ని, త్యాగాన్ని తవ్విపోసుకొంటారు. 'నాన్న నా ఊపిరి' అనే కవితలో తండ్రి ప్రభావం తనపై ఎంత ప్రగాఢంగా ప్రసరించిందో చెపుతారు. నాలుగోసారి తాను ఆడపిల్లగా పుట్టినా తండ్రి, తనను కాలు కింద పెట్టనివ్వకుండా పెంచాడని, ఆడపిల్లల తండ్రి అని అందరూ అలుసుగా చూసినా నిబ్బరంగా నిలబడిన ధీరుడని, తనలో చిన్నప్పటి నుంచి సాహిత్య బీజాలు నాడాడని,ఆయన మంచి తండ్రేకాదు, మంచి కొడుకు కూడా అని వివరించారు. తనపై తండ్రి ప్రభావం ఎంత ప్రగాఢమయిందో వివరించారు.

'నా డైరీ కనిపించడంలేదు' అంటూ రాసిన కవితలో–

"నా దినచర్యను తన భుజాలకెత్తుకొని
నా సంతోషంలో భాగమై
నా విచారాన్ని తన హృదయానికి హత్తుకొని
నను ఓదార్చి, సేదదీర్చే
నా డైరీ కనిపించడంలేదు
మీరెవరైనా చూసారా?' అంటూ

మిస్ అయిన తన డైరీని గూర్చి వాపోతారు. ఇంకా ఈ సంపుటిలో టిఫిన్ సెంటర్ గురించీ, కాలేజ్ రోడ్డు' గురించీ, నాన్నిచ్చిన పర్సును గురించీ, బాల్యపు అనుభూతుల్ని గూర్చి – ఇంకా అనేకానేక అంశాల్ని గూర్చి కవిత్వీకరించారు శ్రీమతి మంజుల.

ఈమె కవిత్వంలో ఎక్కడా సంక్లిష్టత, అస్పష్టత అనేవి కనిపించవు. ప్రతి కవితా సామాన్య పాఠకుణ్ణి కూడా, తన కూడా లాక్కొనిపోతుంది. వస్తు స్వీకరణ, భావవ్యక్తీకరణ ఈ రెండూ ఈ కవితా సంపుటికి రెండు కళ్ళు. అందరికీ నిత్య జీవితంలో ఎదురయ్యే విషయాలే ఇందలి కవితా వస్తువులు. వాటిని వ్యక్తీకరించే శైలి ఎంతో సరళంగా, మార్దవంగా, చక్కని బిగింపుతో సాగిపోతుంది.

– డా. జోస్యుల కృష్ణబాబు
98664 54340

శైలజామిత్ర కవిత్వం ఒక అంతర్ముఖ పరిమళ భరితం

1997లో తన తొలి కవితా సంపుటిని ముద్రించిన కవయిత్రి శైలజామిత్ర– తాజాగా 10వ కవితా సంపుటి 'జన్మించడమే కవిత్వం'తో పాఠకుల ముందుకొచ్చారు. ప్రతిష్టాత్మక తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, అపురూప విమర్శ పురస్కారాలు అందుకున్న అనంతరం బహు బాధ్యతతో వెలువరించిన సంపుటి ఇది.

ఈ కవిత్వం చదువుతుంటే "నా హృదయ వృక్షంపై నిలిచి లక్ష పక్షులు యుద్ధగీతాలు పాడుతుంటాయి" అన్న పాలస్తీనా మహాకవి మహమూద్ దార్విష్ మాటలు గుర్తుకొచ్చాయి. అవును... దశాబ్దాలుగా సంపద్వితమైన సృజనాత్మక రచనలు అవిశ్రాంతంగా, అలుపెరుగక చేస్తున్న ఒక విదుషీమణి ఆమె. బైరాగి లాంటి అంతర్ముఖ మానసిక యుద్ధ భావాల్ని స్పృశిస్తూ చేసిన అద్భుతమైన కవితా సృజన చదివాక పైన ఉదహరించిన మహాకవి మాటలు గుర్తురావటం సముచితమే కదా..! పుస్తక ముందు మాటలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం కూడా 'ఈ కవయిత్రి తన అస్తిత్వాన్ని విశేషంగా ప్రకటిస్తుంది, నవ్య భావనని ప్రతిపాదిస్తుంది. ఇందులోని ప్రతి కవితా ఒక రస నిర్భర చషకం. మొత్తంగా ఇదొక భావామృత కలశం' అనడం గమనార్హం. మరో అభినందన రాసిన సుప్రసిద్ధ రచయిత్రి, అనువాదకురాలు అంబికా అనంత్ ... ఈ కవిత్వంలో సమన్వయ ధోరణిలో కొన్ని, జ్వలిస్తూ ప్రశ్నించేవి కొన్ని. కానీ అన్నీ మానవ జీవితాలకు స్పందన స్ఫూర్తినిచ్చేవి, భావచేతనాశక్తి నింపుకున్నవి' అనడం సందర్భోచితం.

కవయిత్రి శైలజామిత్ర తన మాటలో 'నాలో అంతర్ముఖంగా సాగే పోరాటాన్ని, బాహ్యరూపంలో కనిపించే ఆవేశాన్ని బహిర్గతం చేయడం ద్వారా నేను ఆశిస్తున్న సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కృతం చేయగలననుకున్నాను' అనడం మనం అనుకున్న అంతర్యుద్ధం మాటకు బలమిచ్చేలా వుంది. తన అంతర్యుద్ధ ప్రకటనకు కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్న సృజనకారిణిగా ఆమె ఈ తాజా కవిత్వంలో దర్శనమిస్తుంది. ఆమె కవిత్వ భూమికలు ఆధునికానంతర, విలక్షణ అభివ్యక్తి, మార్మికత, విశిష్ట భావుకతలతో ఆమెను ప్రామాణిక కవయిత్రిని చేశాయి. 'ఋషి కానివారు కావ్యం రాయలేరు' అన్నట్లు అనేక రోజువారీ అంశాలను ఆమె ఒక ధ్యానముద్రలో రాసి, ప్రసరింపచేసినట్లు అనిపిస్తాయి. అనేక సందర్భాల్లో ఆమె పుచ్చుకున్న ఆశ్రమ వైరాగ్యం ప్రతిబింబిస్తుంది. ఈ వాక్యాలు అసమానం అని మెట్లు కట్టి చెప్పడం నాకు ఇష్టం వుండదు, కనుక నన్ను విశేషంగా ఆకట్టుకున్న రెండు కవితల్ని విశ్లేషించి మీకు పరిచయం చేస్తాను.

పిట్ట : ఆధునిక కవిత్వం గతానుగతికత్వాల్ని పూర్తిగా విసర్జించింది. ఏ కవి/ కవయిత్రికి ఆ కవి కొత్త దినుసుల కోసం అన్వేషిస్తూ నవనవోన్మేషశాలిగా కవిత్వాన్ని శిఖరాగ్రం మీద నిలుపుతున్నదిప్పుడే! ప్రతి కవి/ కవయిత్రి ఒక ప్రయోగశాలగా సాగిపోతున్నాడు. కవిత్వం కాలక్రిమి దష్టం కాకుండా కాపాడే నాఫ్తలీన్ ఉండలు లాగా ఆధునిక కవిత్వంలోని వస్తువులు, పదచిత్ర సంవిధానం ఉపయుక్తమౌతున్నది.

ఈ పిట్ట కవితను పరిశీలిస్తే 'ఆ పిట్టకి వేరే పని లేదు/ ఎంత తరిమినా దూరంగా పోదు' అని ప్రారంభించారు. ఈ పిట్ట జ్ఞాపకాల పిట్ట. మనిషి జీవితంలో అన్నీ జ్ఞాపకాలే! అనుభూతులే! ఆ అనుభూతుల్ని నెమరువేసుకుంటూ సాగిపోతాడు మనిషి. కవితను కొనసాగిస్తూ 'నాకు వేరే పని తోచనీయకుండా/ నా తలచుట్టూ చేరి/ తన గొంతు ప్రావీణ్యాన్ని చూపాలనే/ దాని తపనంతా..' అంటారు. గొంతు ప్రావీణ్యం అనడంలో జ్ఞాపకాల దొంతర ఎంత దట్టంగా ఉందో చెప్తున్నారు. 'నా కనులు తడిసిపోయినప్పుడు/ కాసేపు కనుమరుగైనట్లు నటిస్తుంది/ శూన్యంలోకి నా చూపును గమనించి/ తనలోని నేనిష్టపడే రంగుల్ని/ ఫ్యాషన్ పెరేడ్‌లా పదే పదే చూపుతుంది' అన్నారు. ఈ ఆలోచనలు, అనుభూతుల దొంతరకు కొంత విరామం ఉంటుంది. వెంటనే బాధను కలిగించేవి, బోధను కలిగించేవే కాక, మధురానుభూతుల్ని అందించే జ్ఞాపకాలు సైతం మదిలో సప్తవర్ణాలతో దర్శనమిస్తుంది' అంటున్నారు. 'మనిషి జీవితంలోకి/ మొదటి పేజీ నుండి ప్రారంభమైన/ ఈ జ్ఞాపకాల పిట్ట/ ఎంత తరిమినా నన్నొదిలిపోదు/ ఎవరున్నా లేకున్నా/ నన్నొదిలిపోదు' అని ముగించారు. అనుభూతుల దొంతరను, జ్ఞాపకాల నీడలను ఆపడం ఎవరి తరమూ కాదు. జీవిత చరమాంకం వరకూ వెంటాడుతూనే ఉంటాయన్న సత్యాన్ని తెలియజేస్తారు.

పుస్తకం



ఈ సంపుటికి శీర్షికగా అమరిన 'జన్మించడమే కవిత్వం' అన్న కవితలో – జీవితానికి, కవిత్వానికి ఉన్న సహ సంబంధాన్ని విశదపరిచారు. ప్రధానంగా తాత్త్వికులు తత్త్వ విషయ వివేచనతో పాటుగా భావజాలంతో సైతం ప్రమేయం కలిగి ఉంటారు. కవితల్లో ఏవో వైయక్తిక ప్రతీకలు, భావజాలం ద్వారా తమ వ్యక్తీకరణలకు స్పష్టత చేకూరుస్తూ ఉంటారు. ఆధునిక కవిత్వానికి కేవలం హృదయమే కాదు, మనస్సు సైతం కార్య రంగమే! కవిత్వానికి ప్రధానంగా కావల్సింది ఆవేశపరతకీ, ఆత్మపరతకీ సమన్వయత ఘటింపబడడం. ఆ సమన్వయ విశేషమే పాఠకుడు ఈ కవితలో అనుభవిస్తాడు.

'కవిత్వమంటేనే కవికి మరో జన్మ/ అమ్మ ఎన్ని బాధలు పడి నాకు జన్మనిచ్చిందో/ నాకు తెలియదు కానీ/ నాలోంచీ కవిత్వం రూపుదిద్దుకున్నప్పుడల్లా/ నాకు మరో జన్మ ఎత్తినట్టుంది/ నేను మరో బిడ్డకు జన్మనిచ్చినట్లుంది" అంటూ ప్రారంభించి, కవిత్వాన్ని ఆషామాషీగా తీసుకోకూడదనీ, కవిత్వ సృజన అంత తేలికైనది కాదని, నిజమైన కవితకు జన్మ నివ్వాలంటే పురిటినొప్పులు అనివార్యమని చెప్తున్నారు. కవిత్వం రచయిత్రిలో ఎప్పుడెప్పుడు తన్నుకొస్తుందో వివరించాక 'స్వేచ్ఛలేని చోట సర్వం కోల్పోయినట్లుగా/ స్వాతంత్ర్యమే స్వాహా అయినచోట స్వగతం నిలదీస్తున్నట్లుగా/ అక్కడక్కడా నిరాశా నిస్పృహలు కావలి కాస్తున్నప్పుడు/ నే కవిత్వంగా మారిపోతున్నాను' అంటారు. కవిత్వం ఎప్పుడు పుడుతుంది? వాల్మీకికి కరుణరసంతో పుట్టినట్లు– ఒక్కొక్కరికి ఒక్కో సమయంలో జనిస్తుంది. రచయిత్రికి స్వాతంత్ర్యం అపహరింపబడ్డప్పుడు కవిత్వం జనిస్తుంది. నిరాశా నిస్పృహలు ఆవరించినప్పుడు జనిస్తుంది. కవిత ముగింపులో 'ప్రారంభమైనా.. ముగింపైనా/ కవిత్వమే కదా కవిని ఆదరించేది' అనే ఒక్క భావనను బలంగా విసిరారు.

శైలజామిత్ర తెలుగు సాహిత్యలోకానికి చిరపరిచితం అని, ఈ సంపుటిలో తనని తాను సృజనలో విముక్తం చేసుకుంది అన్న సుప్రసిద్ధ కవయిత్రి శిలాలోలిత మాటలు అక్షర సత్యాలు. ఈ కవిత్వంలో అంతర్లీనంగా కనిపించే కవయిత్రి ధిక్కార స్వరం కూడా పఠితలు తప్పక గమనిస్తారు. సమకాలీన రుగ్మతల పట్ల వీరి కలం ఝుళిపిస్తూనే మరింత కాలం తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేస్తారని ఆశిస్తూ... ఈ కవిత్వానికి స్వాగతం!

– డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

శ్రీశ్రీ స్మారక కథల పోటీ - 2024

నా సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా నాకు స్ఫూర్తి, ప్రేరణ అయిన మహాకవి శ్రీశ్రీకి చిరు నివాళిగా 2023లో నిర్వహించిన పోటీకి వచ్చిన అపూర్వ స్పందన చూసి ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నాము. మూడు కథలకు ఒక్కో దానికీ రూ.2000 చొప్పున బహుమతులు ఉంటాయి. అంశాలు : రొట్టె ముక్క, అరటి తొక్క, బల్లచెక్క. ఒక్కో అంశానికీ ఒక్కో బహుమతి అనే నియమం లేదు. బాగుంటే ఒక్క అంశం మీదే రాసినా ముగ్గురికీ ఇవ్వొచ్చు. 50 ఏళ్లు దాటని వారికే ఈ పోటీ పరిమితం. బహుమతి పొందిన కథలు 'మా కథలు –2023' సంకలనంలో ప్రచురించబడతాయి. కథ చేతిరాతలో 3– 8 పేజీలు, డిటిపి అయితే, 3–5 పేజీల మధ్య ఉంటే మంచిది. కథలు పంపటానికి ఆఖరి తేది :20–8–2024. ఫలితాల ప్రకటన 20–9–2024. 14.10.2024న రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం ఉంటుంది. కథలు పంపాల్సిన చిరునామా : Ch.Siva Rama Prasad (Vanisri), Swagruha apartments, C- block, F-2, opp. KPHB, Kukatpally, Hyderabad – 500072. Cell : 939008 5292, 83098 60837 – సింహప్రసాద్

'సోమేపల్లి' చిన్న కథల పోటీ

పద్నాలుగు ఏళ్ళుగా తెలుగు చిన్న కథల పోటీ నిర్వహిస్తూ తెలుగు సాహిత్యరంగంలో విశిష్ట అవార్డులుగా ప్రఖ్యాతిని చాటుకుంటున్న సోమేపల్లి సాహితీ పురస్కారాలు ఈ ఏడూ ఇవ్వాలని సోమేపల్లి వారి కుటుంబం నిర్ణయించింది. అత్యుత్తమ కథకు రూ.2500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000, ఇద్దరికి ప్రత్యేక బహుమతులు రూ.500 చొప్పున ఇవ్వబడతాయి. కథల నిడివి రాతప్రతిలో 2– 4 పేజీలు; టిడిపిలో 2 పేజీలూ ఉండాలి. ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను ఆగస్టు 30, 2024 లోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11–57/1–32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ–520001 (సెల్ : 92474 75975) చిరునామాకు పంపాలి.

– వశిష్ట సోమేపల్లి, చలపాక ప్రకాష్

కథలకు ఆహ్వానం

గతంలో విభిన్న కథా సంకలనాలకు సంపాదకత్వం వహించిన కస్తూరి మురళీకృష్ణ, కోడీహళ్ళి మురళీమోహన్‌ల ఆధ్వర్యంలో వచ్చే దీపావళికి సైనికులు కథాంశంగా వెలువడనున్న కథా సంకలనంలో ప్రచురణ కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. దేశ రక్షణ కోసం సైనికుల పోరాట పటిమను, కర్తవ్య దీక్షను, త్యాగనిరతిని, దేశభక్తిని విభిన్న కోణాల్లో ప్రతిబింబింపజేసే కథలు పంపాలి. ప్రచురితమైన కథలు కూడా పంపొచ్చు. కొత్తవైతే 'సంచిక' వెబ్ పత్రికలో కూడా ప్రచురిస్తాము. ఇతరులు రాసిన కథలను సూచించవచ్చు. కథలను పోస్టు, ఇ మెయిల్, వాట్సాప్ ... ఏ విధంగానైనా పంపవచ్చు. కథలను పంపాల్సిన చివరి తేదీ : 31 అక్టోబర్ 2024. చిరునామా : కస్తూరి మురళీకృష్ణ, ప్లాట్ నెం. 32, ఇంటి నెం.8–48, రఘురాం నగర్ కాలనీ, ఆదిత్య హాస్పిటల్ వీధి, దమ్మాయిగూడ, హైదరాబాదు 500083. వాట్సాప్ : 984961 7392. మెయిల్ ఐటి : sanchikastorycompilation@gmail.com.

21న కార్టూనిస్టు శేఖర్ అవార్డు ప్రదాన సభ

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డు 2024 సంవత్సరానికి గాను తెలంగాణ టుడే కార్టూనిస్ట్ పి.నర్సిం ఎంపికయ్యారు. జులై 21 ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆ అవార్డు ప్రదాన సభ జరుగుతుంది. అందరికీ స్వాగతం!

– శేఖర్ కుటుంబ సభ్యులు, మిత్రులు
90521 16323

21న తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక పురస్కార ప్రదానం

ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు సుఖమంచి కోటేశ్వరరావుకు 25వ తంగిరాల కష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని జులై 21 సాయంత్రం 5 గంటలకు ఠాగూర్ గ్రంథాలయం, విజయవాడలో ప్రదానం చేయనున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటున్నారు. 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుంది.

– తంగిరాల చక్రవర్తి, తంగిరాల ట్రస్టు ఛైర్మెన్

16న మఖ్దూం పురస్కార ప్రదాన సభ

హైదరాబాద్‌లోని ప్రభుత్వ సిటీ కళాశాల సమావేశ మందిరంలో జూలై 16 మంగళవారం ఉదయం 11 గంటలకు సిటీ కాలేజీ మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ పురస్కారం (2024)' ప్రదానోత్సవ సభ జరుగుతుంది. డా.అమ్మంగి వేణు గోపాల్ ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో డా.ముదిగంటి సుజాతా రెడ్డి, డా.యాకూబ్, వాహెద్, డా.రాయారావు సూర్య ప్రకాశరావు అతిథులుగా పాల్గొంటారు. డా. విప్లవ్ దత్ శుక్ల, సభ్యులు డా.ఏలూరి యాదయ్య, డా. జె రత్న ప్రభాకర్, డా.కోయి కోటేశ్వర రావు సభను సమన్వయం చేస్తారు.

19న సాహిత్య పురస్కారాల ప్రదానం

జులై 19, 2024న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ గుండవరపు హనుమంతరావు కళావేదికపై నిర్వహించే సాహితీకిరణం 15వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డా॥పింగళి జగన్నాథరావు స్మారక సాహిత్య పురస్కారం–24 మరుమాముల దత్తాత్రేయ శర్మకి, సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్యపురస్కారం– 2024ని రమణ వెలమకన్నికి, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారం–2024ని శైలజామిత్రకి, గట్టుపల్లి చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారం–2024ని బండారుపల్లి రామచంద్రరావుకి, మరో ఆరుగురికి సాహితీకిరణం ఆత్మీయ పురస్కారాలు అందజేస్తారు. సభలో డా॥ కె.వి.రమణ, గుదిబండి వెంకటరెడ్డి, వి.ఎస్.జనార్దనమూర్తి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి జయలక్ష్మి, వి.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొంటారు.

– పొత్తూరి సుబ్బారావు

బిఎస్‌పి నేత హత్య కేసులో నిందితుడి ఎన్‌కౌంటర్

చెన్నై : తమిళనాడు బిఎస్‌పి అధ్యక్షులు కె.ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు నిందితుల్లో ఒకరైన తిరువేంగడం ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేయడానికి ఉపయోగించిన ఆయుధాలను చెన్నైకు సమీపంలోని మాధవరంలోని ఒక ప్రాంతంలో ఉంచినట్లు చెప్పడంతో ఆదివారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో తిరువేంగడంను పోలీసులు అక్కడికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత పోలీసులపై దాడి చేసి పారిపోయేందుకు తిరువేంగడం ప్రయత్నించాడు. దీంతో అతనిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో 11 మంది నిందితుల్లో తిరువేంగడం ఒకరు. ఈ నెల ప్రారంభంలో ఆర్మ్‌స్ట్రాంగ్‌పై అతని ఇంటికి సమీపంలోనే కొంతమంది దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

కాంగ్రెస్ లోక్‌సభ ఉపనేతగా గౌరవ్ గొగొయ్

- చీఫ్ విప్‌గా కె.సురేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఉపనేతగా ఎంపి గౌరవ్ గొగొయ్‌ను తిరిగి నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ ఎక్స్(ట్విటర్)లో ఆదివారం వెల్లడించారు. గతంలోనూ గౌరవ్ గొగొయ్ పార్టీ లోక్‌సభాపక్ష ఉపనేతగా బాధ్యతలు నిర్వహించారు. లోక్‌సభలో పార్టీ చీఫ్ విప్‌గా ఎనిమిదిసార్లు ఎంపిగా గెలిచిన సీనియర్ మెంబర్ కొడికున్నిల్ సురేష్‌ను నియమించారు. సీనియర్ నేతలు మాణిక్యం ఠాగూర్, ఎండి జావెద్‌లకు లోక్‌సభలో విప్ బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు సంబంధించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీ లోక్‌సభ స్పీకర్‌కు ఒక లేఖ రాశారు.

ఉద్యోగాల కల్పనపై మోడీ అబద్ధాలు : ఖర్గే

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఉద్యోగాలు కల్పనపై ప్రధాని మోడీ మరోసారి అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. మూడు నాలుగేళ్లలో ఎనిమిది కోట్ల ఉద్యోగాలిచ్చామంటూ ప్రధాని మోడీ శనివారం చేసిన వ్యాఖ్యలపై ఖర్గే ఆదివారం ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎ) కోట్ల మంది యువకులకు ఓ వరం అని 2020 ఆగస్టులో మోడీ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. ఈ సాధారణ అర్హత పరీక్ష బహుళ పరీక్షల అవసరాన్ని తొలగిస్తుందని, సమయం, వనరులను ఆదా చేస్తుందని, పారదర్శకతను కూడా పెంచుతుందని మోడీ అన్నారని తెలిపారు. నాలుగేళ్లలో ఎన్ఆర్ఎ ఒక్క పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదని, కేటాయించిన రూ.1,517 కోట్ల నిధుల్లో రూ.58 కోట్లే ఎందుకు ఖర్చు చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకం కోసం ఎన్ఆర్ఎ ఏర్పాటు చేశారని, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్ వర్గాల యువకుల రిజర్వేషన్ హక్కులను కాలరాయడానికే ఉద్దేశపూర్వకంగా పనిచేయకుండా ఉంచారా? అని మోడీని ప్రశ్నించారు. నీట్ పరీక్షల్లో అక్రమాలకు, పేపర్ లీక్‌లకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని వినియోగించారని అన్నారు.

గూండారాజ్‌పై
పెల్లుబికిన ప్రజాగ్రహం

- సిపిఎం అభ్యర్థి హత్యకు నిరసనగా త్రిపుర బంద్ విజయవంతం

అగర్తలలో ఆందోళన

న్యూఢిల్లీ : త్రిపురలో ఆగస్టు 8న జరిగే జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయనున్న సిపిఎం అభ్యర్థిని బిజెపి గూండాలు దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ జరిగింది. గూండారాజ్‌ను సహించేది లేదంటూ నిరసనకారులు నినదించారు. ప్రతిపక్షాల పిలుపు మేరకు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 12 గంటల పాటు బంద్ పాటించారు. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి, విద్యా సంస్థలు తెరవలేదు. దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్ స్థానం నుంచి సిపిఎం అభ్యర్థిగా నిలబడిన బాదల్ షిల్ (49)పై ఈ నెల 12న రాజ్‌నగర్ వద్ద బిజెపి గూండాలు మాటు వేసి మారణాయుధాలతో ఆకస్మికంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను అగర్తలలోని జెబిపి ఆసుపత్రికి తరలించగా, అక్కడ మరణించారని త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలపై బిజెపి గూండాలు దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ దాఖలు చేయడం కోసం రాజ్‌నగర్ హెచ్ఎస్ పాఠశాల వద్దకు వెళుతుండగా ఈ దాడి చేశారని తెలిపారు. దాడిలో పలువురు సిపిఎం కార్యకర్తలు గాయపడ్డారని, తలకు బలమైన గాయం కావడంతో బాదల్ మరణించారని చెప్పారు. బాదల్ హత్యకు నిరసనగా నిర్వహించిన బంద్‌కు కాంగ్రెస్ కూడా మద్దతు ప్రకటించింది.

బాదల్ హత్యను ఖండించిన ఎఐకెఎస్

రైతు నాయకుడు బాదల్‌ను బిజెపి గూండాలు హత్య చేయడాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిపుర కిసాన్ సభ దక్షిణ త్రిపుర జిల్లా కమిటీలో బాదల్ సభ్యులని తెలిపింది. బాదల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. బాదల్ ఉపాధ్యాయుడని, దక్షిణ త్రిపురలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడింది. బాదల్ హత్య కేసులో ఇప్పటి వరకూ పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేదని, బిజెపి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం నేరగాళ్లను కాపాడుతోందని విమర్శించింది. త్రిపురలో ప్రజాస్వామ్య, చట్టబద్ధ పాలనను పునరుద్ధరించే పోరాటంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలను కూడగట్టడం ద్వారా హింసను ప్రతిఘటిస్తామని ఎఐకెఎస్ తెలిపింది. నియంతృత్వ, మతోన్మాద శక్తులపై ఎఐకెఎస్ పోరాడుతుందని స్పష్టం చేసింది.

హిందువులు, ముస్లింలు కలిసి జీవించటమే భారత సంప్రదాయం

- ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్

న్యూఢిల్లీ : హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి జీవించే సంప్రదాయం భారత్‌లో ఉన్నదని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. అలీపూర్ జైలు మ్యూజియంలో నిరుపేద యువతలో పుస్తక పఠన అలవాట్లను పెంపొందించేందుకు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "మన దేశ చరిత్రను పరిశీలిస్తే.. హిందువులు, ముస్లింలు యుగయుగాలుగా సంపూర్ణ సమన్వయంతో సామరస్యంతో కలిసి జీవిస్తున్నారు. ఇది 'జుక్తోసాధన' అని క్షితిమోహన్ సేన్ తన పుస్తకంలో నొక్కిచెప్పారు. ఈ 'జుక్తోసాధన' ఆలోచనను మనం నొక్కి చెప్పాలి" అని ఆయన అన్నారు. "మీరు ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్, పండిట్ రవిశంకర్‌ల మధ్య వారి మతపరమైన గుర్తింపులను వేరు చేయగలరా? వారి సొంత శాస్త్రీయ సంగీత శైలి కోసం వారిని వేరుచేయవచ్చు" అని ఆయన అన్నారు. భారతదేశ బహుళత్వ లక్షణాన్ని అణచివేసే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ, ఉపనిషత్తులను పార్సీలోకి అనువదించిన కొద్దిమందిలో ముంతాజ్ కుమారుడు దారా షికో ఒకడని అమర్త్యసేన్ గుర్తు చేశారు. దారాషికో హిందూ గ్రంథాలు, సంస్కృత భాషలో చాలా ప్రావీణ్యం కలిగి ఉన్నాడని ఇది చూపిస్తున్నదని అన్నారు. "తాజ్ మహల్ చాలా అందంగా కనిపించటం, చాలా గొప్పతనాన్ని కలిగి ఉండటం పట్ల ఒక అభిప్రాయం వ్యతిరేకించగా, స్మారక చిహ్నం పేరును ముస్లిం పాలకులతో సంబంధం లేకుండా మార్చాలని కోరుకునే మరొక వర్గమున్నదని ఆయన తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌కు బిజెపి ద్రోహం

- ఎల్‌జికి అపరిమిత అధికారాలివ్వడం రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమే : కాంగ్రెస్

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కి కేంద్రం మరిన్ని అధికారాలను కట్టబెట్టిన మోడీ సంకీర్ణ ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 30లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ.. అలా చేయకుండా కేంద్రపాలిత ప్రాంతం (యుటి) జమ్ముకాశ్మీర్‌కు బిజెపి ద్రోహం చేస్తున్నదని విమర్శించింది. ఎల్‌జికి మరిన్ని అధికారాలను అప్పగించాలనే బిజెపి సంకీర్ణ ప్రభుత్వ నిర్ణయాన్ని 'సంవిధాన్ హత్యా దివస్'గా అభివర్ణించింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. "మార్పులు రెండు అర్థాలను సూచిస్తున్నాయి. మోడీ ప్రభుత్వం జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణను ఆలస్యం చేయాలనుకుంటున్నది. లేదా రాష్ట్ర హోదా పునరుద్ధరించబడినప్పటికీ.. కొత్తగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని అణచివేయటం ద్వారా ఎల్‌జి దయ ప్రకారం నడుచుకునేలా చేయాలనుకుంటుంది" అని అన్నారు.

జమ్ము కాశ్మీర్‌ను మరింత దిగజార్చారు

- చారిత్రిక రాష్ట్ర హోదా నుండి పెద్ద మున్సిపాలిటీ స్థాయికి...
- పునర్వ్యవస్థీకరణ చట్టం - 2019 సవరణలపై సిపిఎం నేత తరిగామి

న్యూఢిల్లీ : జమ్ము కాశ్మీర్ చారిత్రిక రాష్ట్ర ప్రతిపత్తిని, అలాగే అరకొరగా ఉన్న నామమాత్రపు హక్కులను హరించేసి దీనిని ఒక పెద్ద మున్సిపాలిటీ స్థాయికి కేంద్రం దిగజార్చిందని జమ్ముకాశ్మీర్ సిపిఎం నేత యూసఫ్ తరిగామి ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్ము కాశ్మీర్ హక్కులపై తాజా దాడికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. పునర్వ్యవస్థీకరణ చట్టం-2019కి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇటీవల చేసిన సవరణలు జమ్ముకాశ్మీర్‌కు నామమాత్రంగా మిగిలిన హక్కులపై మరో దుర్మార్గమైన దాడి అని అన్నారు. జమ్ముకాశ్మీర్‌కి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చట్టానికి చేసిన ఈ సవరణల ద్వారా మరోసారి తీరని ద్రోహం చేసిందని ఆయన విమర్శించారు.

2018 నుంచి దేశంలో అసెంబ్లీ లేకుండా ఉన్న ఏకైక కేంద్ర పాలిత ప్రాంతం జమ్ముకాశ్మీర్ అని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, తాము ఎన్నుకున్న అసెంబ్లీని కలిగి ఉండే చట్టబద్ధమైన హక్కును కూడా ఇక్కడి ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఎన్నికలు జరుగుతాయనే వార్తలు వస్తున్న సమయంలో.. ఇప్పుడు చట్టానికి చేసిన ఈ నిరంకుశ సవరణలు రాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ఈ చర్య ప్రజలను మరింత నిరాశపర్చిందని అన్నారు. ఒక వేళ ఇక్కడ ఎన్నికలు జరిగినా.. ప్రజలచేత ఎన్నికైన శాసనసభ ప్రజలకు ఏమీ చేయలేదని, వారికి ఎలాంటి ఉపశమనాన్ని కలిగించలేదని తెలిపారు. ఇలాంటి నిరంకుశ సవరణలను సిపిఎం పూర్తిగా తిరస్కరిస్తుందని, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి క్రూరమైన ఆదేశాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా తమ గళాన్ని వినిపించాలని విజ్ఞప్తి చేశారు.

లింకన్ నుండి ట్రంప్ వరకూ...

- హత్యలు, దాడులతో రక్తమోడిన అగ్రరాజ్యం

వాషింగ్టన్ : అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిపై, అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులపై దాడి జరగడం ఇది మొదటిసారి ఏమీ కాదు. దేశాధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, అధ్యక్ష ఎన్నికల క్షేత్రంలో నిలిచిన అభ్యర్థులే లక్ష్యంగా గతంలో అనేక రాజకీయ హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ వివరాలు...

కామెడీ షోకు హాజరైనప్పుడు...

హత్యకు గురైన తొలి అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్. 1865 ఏప్రిల్ 14న ఆయనను జాన్ విల్కెస్ బూత్ కాల్చి చంపాడు. లింకన్, ఆయన భార్య మేరీ టాడ్ లింకన్ వాషింగ్టన్‌లోని ఫోర్డ్స్ థియేటర్‌లో 'అవర్ అమెరికన్ కజిన్' అనే కామెడీ షోకు హాజరైన సమయంలో దాడి జరిగింది. తల వెనుక తీవ్ర గాయాలైన లింకన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. నల్ల జాతీయుల హక్కులకు మద్దతు ఇవ్వడమే లింకన్ హత్యకు కారణమని తేలింది. లింకన్ మరణానంతరం ఉపాధ్యక్షుడు అండ్రూ జాన్సన్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. లింకన్‌పై దాడి జరిగిన నెలలోనే 26వ తేదీన వర్జీనియాలోని బౌలింగ్ గ్రీన్ సమీపంలో ధాన్యపు కొట్టులో దాక్కున్న బూత్‌ను కాల్చి చంపారు.

భార్యతో కలిసి పర్యటిస్తుండగా...

1965 నవంబర్‌లో 35వ అధ్యక్షుడైన జాన్ ఎఫ్ కెన్నడీ తన సతీమణి జాక్వెలిన్ కెన్నడీతో కలిసి డల్లాస్‌లో పర్యటిస్తుండగా మాటున దాగిన హంతకుడు లీ ఆర్వీ ఆస్వాయిడ్ అత్యంత శక్తివంతమైన తుపాకీతో కాల్చాడు. తీవ్రంగా గాయపడిన కెన్నడీని పర్క్లాండ్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ఆయన కన్నుమూశారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు టెక్సాస్ పాఠశాల పుస్తకాలు భద్రపరిచే కేంద్రం సమీపంలోని క్షౌరశాలలో ఆస్వాయిడ్‌ను పట్టుకున్నారు. హంతకుడిని డల్లాస్ నైట్‌క్లబ్ యజమాని జాక్ రూబీ కాల్చి చంపాడు.

ట్రంప్ వైపు దూసుకెళ్తున్న బుల్లెట్, గాయపడిన ట్రంప్ (ఇన్‌సెట్‌లో)

అమెరికాకు 43వ అధ్యక్షుడిగా పనిచేసిన జార్జ్ బుష్ 2005లో జార్జియా అధ్యక్షుడు మిఖాయిల్ సాకష్వీతో కలిసి బిల్సీలో ఓ ర్యాలీకి హాజరు కాగా ఆయనపై చేతి గ్రెనేడ్ విసిరారు. అయితే అది పేలకపోవడంతో ఎవరూ గాయపడలేదు. నిందితుడైన వ్లాదిమిర్ అరుతియునియన్‌కు జీవిత ఖైదు శిక్ష పడింది. రెండుసార్లు దేశాధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారి పోటీకి దిగిన థియొడోర్ రూజ్‌వెల్ట్‌పై ప్రచార సందర్భంగా 1912లో మిల్వాకీలో కాల్పులు జరిగాయి. అయితే ఆయనకు తీవ్రమైన గాయాలేవీ కాలేదు. 1968లో అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాబర్ట్ కెన్నడీని లాస్ ఏంజెల్స్ హోటల్‌లో హత్య చేశారు. ఈ ఘటనకు ఐదు సంవత్సరాల ముందు సోదరుడైన జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు గురయ్యారు. 1972లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీపడిన జార్జ్ వాలస్‌పై కాల్పులు జరిగాయి.

ప్రజలతో కరచాలనం చేస్తుండగా...



అమెరికా 25వ అధ్యక్షుడైన విలియం మెకిన్లే 1901 సెప్టెంబర్ 1న న్యూయార్క్‌లోని బఫెలోలో హత్యకు గురయ్యారు. ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం వారితో కరచాలనం చేస్తుండగా 28 సంవత్సరాల నిరుద్యోగ వైద్యుడు లియాన్ ఎఫ్ జోల్గోజ్ ఆయన ఛాతిపై పాయింట్-బ్లాంక్ రేంజ్‌లో రెండుసార్లు కాల్పులు జరిపాడు. మెకిన్లే కోలుకుంటారని వైద్యులు భావించినప్పటికీ బులెట్ గాయం చుట్టూ తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ సోకడంతో సెప్టెంబర్ 14న ప్రాణాలు కోల్పోయారు. అదే ఏడాది అక్టోబర్ 29న జోల్గోజ్‌ను దోషిగా నిర్ధారించి ఎలక్ట్రిక్ కుర్చీలో కూర్చోబెట్టి హతమార్చారు.

బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకే...

అమెరికా 20వ అధ్యక్షుడైన అమెస్ గార్‌ఫీల్డ్‌ను హత్య చేశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలలకే ఆయన హత్యకు గురయ్యారు. 1881 జూలై 2న న్యూజిలాండ్ వెళ్లేందుకు వాషింగ్టన్ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం నడుస్తుండగా ఛార్లెస్ గిటౌ అనే వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపాడు. గార్‌ఫీల్డ్ ఛాతిలో దిగబడిన తూటాను ఓ పరికరంతో కనిపెట్టేందుకు టెలిఫోన్‌ను కనుగొన్న అలగ్జాండర్ గ్రహం బెల్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ పరికరాన్ని దేశాధ్యక్షుడి కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. కాల్పుల ఘటనలో తీవ్రంగా గాయపడిన గార్‌ఫీల్డ్ అనేక వారాల పాటు శ్వేతసౌధంలోనే చికిత్స పొందారు. చివరికి న్యూజెర్సీ తీరానికి తరలిస్తుండగా సెప్టెంబరులో చనిపోయారు. గిటౌను నేరస్తుడిగా నిర్ధారించి 1982లో ఉరి తీశారు.

దాడులు జరిగింది వీరి పైనే

అమెరికా 32వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 1933 ఫిబ్రవరిలో మియామీలో ప్రసంగిస్తుండగా కాల్పులు జరిగాయి. ఈ ఘటన నుండి రూజ్‌వెల్ట్ తప్పించుకున్నప్పటికీ చికాగో మేయర్ ఆంటన్ సెర్మాక్ చనిపోయారు. ఘటనకు బాధ్యుడైన జంగారాకు మరణశిక్ష విధించారు. 1950లో దేశానికి 33వ అధ్యక్షుడిగా వ్యవహరించిన హారీ ఎస్. ట్రూమన్ నివసిస్తున్న బ్లార్ హౌస్‌లోకి ఇద్దరు సాయుధులు ప్రవేశించి కాల్పులు జరిపారు. ట్రూమన్ తప్పించుకున్నప్పటికీ ఎదురు కాల్పుల్లో అధ్యక్ష భవనం పోలీసు, ఒక దుండగుడు చనిపోయారు. శ్వేతసౌధానికి చెందిన ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. 1975లో అమెరికా 38వ అధ్యక్షుడైన గారీ ఫోర్డ్ కొన్ని వారాల వ్యవధిలోనే రెండు హత్యాయత్నాల నుండి తప్పించుకున్నారు. ఇక 40వ అధ్యక్షుడైన రోనాల్డ్ రీగన్ 1981 మార్చిలో వాషింగ్టన్ డీసీలో తన ప్రసంగాన్ని ముగించి, వాహనం వైపు నడిచి వెళుతుండగా జనంలో ఉన్న జాన్ హింక్లీ జూనియర్ కాల్పులు జరిపాడు. ఈ సంఘటన నుండి ఆయన కోలుకున్నప్పటికీ మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.


ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్

హారీ ఎస్. ట్రూమన్

గారీ ఫోర్డ్


రోనాల్డ్ రీగన్

మణిపూర్‌లో కాల్పులు

- సిఆర్‌పిఎఫ్ జవాన్ మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లో మరోసారి కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం జిరిబామ్ జిల్లా మోంగ్‌బంగ్ గ్రామంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో సిఆర్‌పిఎఫ్ జవాన్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఓ పోలీస్ అధికారి కూడా గాయపడ్డాడని, ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు వైద్యులు తెలిపారని చెప్పారు. బీహార్‌కు చెందిన జవాన్ అజయ్‌కుమార్ ఝా (43) తలకు బుల్లెట్ గాయాలయ్యాయని, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని తెలిపారు. దాడిలో భద్రతా సిబ్బంది వాహనం ధ్వంసమైందని చెప్పారు. శనివారం రాత్రి కూడా గ్రామంలో తుపాకీ శబ్దాలు వినిపించాయని ఓ అధికారి తెలిపారు. దాడి అనంతరం మోంగ్‌బంగ్‌లో అదనపు భద్రతా బలగాలను మోహరించినట్లు వెల్లడించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో... గత ఏడాది మే నుంచి కుకీలు, మెయితీల మధ్య చెలరేగిన హింసాకాండలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ లక్షలాదిమంది శరణార్థి శిబిరాల్లోనే ఉన్నారు.

అమెరికాలో హింసకు తావులేదు : బైడెన్

- కాల్పుల ఘటనను ఖండించిన పలువురు ప్రపంచ నేతలు

'ఈ తరహా హింసకు అమెరికాలో తావు లేదు' అని దేశాధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనను ఖండించడానికి ఒకే జాతిగా తామంతా ఏకమవ్వాలని చెప్పారు. కాల్పులపై తనకు సమాచారం అందించారని అంటూ తన ప్రత్యర్థిని రక్షించిన సీక్రెట్ సర్వీస్‌ను అభినందించారు. ఘటన నేపథ్యంలో బైడెన్ తన ఎన్నికల ప్రచార కార్యక్రమాలను, రాజకీయ అడ్వర్‌టైజ్‌మెంట్లను నిలిపివేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రంప్‌తో మాట్లాడారు. ట్రంప్ ప్రస్తుతం బాగానే ఉన్నారని చెప్పారు. ట్రంప్, ఆయన కుటుంబం, మాతిమాలిన చర్యలో గాయపడిన వారందరి కోసం ప్రార్థిస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ చెప్పారు. కాల్పుల ఘటన తర్వాత తన తండ్రి గొప్ప స్ఫూర్తిని ప్రదర్శించారని ట్రంప్ చిన్న కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ తెలిపారు. అమెరికా రక్షణలో ఆయన ఎప్పటికీ పోరు ఆపరని అన్నారు.

కాగా కాల్పుల ఘటనను పలువురు ప్రపంచ నేతలు తీవ్రంగా ఖండించారు. అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జార్జ్ బుష్, బిల్ క్లింటన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్యూ, బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బానీస్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, హంగరీ ప్రధాని విక్టర్ ఆర్బన్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తదితరులు ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండించారు.

ఆందోళన వ్యక్తం చేసిన మోడీ, రాహుల్

న్యూఢిల్లీ : డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన దాడిపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని ఆయన తెలిపారు. 'నా స్నేహితుడు ట్రంప్‌పై జరిగిన దాడి నన్ను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలు, ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబం, గాయపడిన అమెరికన్ల కోసం తాము ప్రార్థిస్తున్నామని చెప్పారు. ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా కాల్పుల ఘటనను ఖండించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

శబ్దాలు వినిపించాయి. నా చర్మంలో తూటా దిగిందని అనుకున్నాను. చాలా రక్తం కారింది' అని ఆయన తెలిపారు. కాల్పుల ఘటన నేపథ్యంలో సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు, ఎఫ్‌బీఐ సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించాయి.

ఏం జరిగింది ?

ర్యాలీకి హాజరైన ప్రజానీకం కరతాళధ్వనులు చేస్తుండగా, 'అమెరికాను దేవుడు ఆశీర్వదిస్తాడు' అంటూ పాట విన్పిస్తుండగా ఒక్కసారిగా కలకలం రేగింది. ట్రంప్ తన ఎన్నికల ప్రసంగాన్ని ప్రారంభిస్తూ జో బైడెన్ ప్రభుత్వ హయాంలో సరిహద్దులను అక్రమంగా దాటుతున్నారని చూపే చార్టును ప్రదర్శించారు. ఇంతలో హఠాత్తుగా ఐదుసార్లు కాల్పులు జరిపిన శబ్దాలు విన్పించాయి. ఒక తుపాకీ గుండు ట్రంప్ చెవికి తగలడంతో ఆయన గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్ వద్దకు వెళ్లి కింద కూర్చోవాలని సూచించారు. అక్కడ ఉన్న జనం కూడా ఒక్కసారిగా కింద కూర్చున్నారు. ఆ సమయంలో మైదానంలో నిశ్శబ్దం అలుముకొంది. అప్పుడప్పుడు కొన్ని అరుపులు వినిపించాయి. ట్రంప్‌ను సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు చుట్టుముట్టి ఆయనకు రక్షణగా నిలిచారు. ట్రంప్ మాత్రం దీనిని పట్టించుకోకుండా మద్దతుదారుల 'అమెరికా...అమెరికా...అమెరికా' నినాదాల మధ్య పిడికిలిని మూడుసార్లు పైకెత్తి 'ఫైట్' అంటూ నినదించారు. ట్రంప్ ప్రసంగించే వేదికకు 130 గజాల దూరం నుండి దాడి జరిగినట్లు తెలుస్తోంది. హంతకుడు అక్కడ ఉన్న ఓ తయారీ కేంద్రం పై కప్పు మీది నుండి కాల్పులు జరిపాడు. అక్కడి నుండి ట్రంప్ ప్రసంగించాల్సిన ప్రదేశం ఫుట్‌బాల్ మైదానం పొడవు కంటే కొంచెం ఎక్కువగా ఉంటుంది. అంటే కాల్పులు జరిపిన వ్యక్తికి ట్రంప్ స్పష్టంగా కన్పించారన్న మాట. బహిరంగ ప్రదేశమైన బట్లర్ వ్యవసాయ ప్రదర్శన మైదానంలో ర్యాలీ జరిగింది. అక్కడ ఉన్నవన్నీ బహిరంగ క్షేత్రాలేనని న్యూయార్క్ పోస్ట్ తెలిపింది.

దుండగుడిని మట్టుపెట్టేందుకు అమెరికా దళాలు వేదిక సమీపంలోని మరో భవనం పైనుండి కాల్పులు జరిపాయి. కాల్పుల అనంతరం ఆ ప్రదేశంలో దుండగుడి మృతదేహం లభించింది. ప్రత్యక్షసాక్షి ఏమన్నారంటే...

ట్రంప్ ప్రసంగం ప్రారంభించిన ఐదు నుండి ఏడు నిమిషాల తర్వాత ఓ వ్యక్తి సమీపంలో ఉన్న భవనం పైకి ఎక్కడం చూశానని, అతని చేతిలో తుపాకీ ఉన్నదని ప్రత్యక్షసాక్షి ఒకరు బీబీసీకి చెప్పారు. ఆ సమయంలో తాను, తన స్నేహితులు అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించామని తెలిపారు.

పార్టీ సదస్సుకు ముందు...

విస్కాన్సిన్‌లోని మిల్వాకీలో మరో రెండు రోజుల్లో రిపబ్లిక్ పార్టీ జాతీయ సదస్సు జరగాల్సి ఉంది. ఆ సదస్సులోనే రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ట్రంప్‌ను అధికారికంగా నామినేట్ చేస్తారు. కాల్పుల ఘటన అనంతరం రిపబ్లికన్ పార్టీ జాతీయ కమిటీ, ట్రంప్ ప్రచారకర్తలు సంయుక్తంగా ఒక ప్రకటన చేస్తూ 'మిల్వాకీలో మీతో కలవాలని ట్రంప్ కోరుకుంటున్నారు. సదస్సు యాథావిధిగా జరుగుతుంది. అమెరికాకు 47వ అధ్యక్షుడిగా పనిచేసేందుకు ఈ సదస్సు ఆయనను నామినేట్ చేస్తుంది' అని తెలిపారు. 1981 తర్వాత అమెరికా అధ్యక్షుడు లేదా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థిని హత్య చేసేందుకు తీవ్రమైన ప్రయత్నం జరగడం ఇదే మొదటిసారి. అప్పుడు వాషింగ్టన్ డీసీలో దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై కాల్పులు జరిగాయి. అయితే ఆయన ఆ ఘటన నుండి సురక్షితంగా బయటపడ్డారు.

ఎవరీ క్రూక్స్ ?



ట్రంప్‌పై హత్యాయత్నం చేసిన 20 సంవత్సరాల థామస్ మాథ్యూ క్రూక్స్ పెన్సిల్వేనియాలోని బెథెల్ పార్కుకు చెందినవాడు. 2021లో డెమొక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసివ్ టర్న్‌ఔట్ ప్రాజెక్టుకు పదిహేను డాలర్లు విరాళంగా ఇచ్చాడు. ప్రభుత్వ ఓటింగ్ రికార్డుల ప్రకారం ఇతను రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా తన పేరును నమోదు చేసుకున్నాడు. ప్రస్తుతం అతని ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. క్రూక్స్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పటికే వైరల్ అయ్యాయి. కాల్పులకు ముందు అతను రికార్డు చేసినట్లు చెబుతున్న ఓ వీడియో కూడా సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది. రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను తాను ద్వేషిస్తున్నానని అతను అందులో చెప్పాడు.

తెరుచుకున్న జగన్నాథ ఆలయ రత్న భాండాగారం

(మొదటిపేజీ తరువాయి)

గదికి మార్చాము. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌ను సీల్ చేశాం. లోపలి గదిలో ఆభరణాలు ఉన్న అల్మరాలు, ట్రంక్‌లను చూసినప్పటికీ, సమయాభావం కారణంగా ఆభరణాలను మరొక తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు మార్చలేకపోయాము, "అని పాధీ చెప్పారు. మరో నిర్ణీత తేదీన మిగిలిన పనులు పూర్తవుతాయని, పునరుద్ధరణ తర్వాత ఇన్నర్ ఛాంబర్ యొక్క ఆభరణాల జాబితా అదే స్థలంలో చేయబడుతుందని తెలిపారు. అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేశామని పూరీ ఎస్‌పి పినాక్ మిశ్రా తెలిపారు. మొత్తం 11 మంది మాత్రమే రత్న భాండాగారం లోపలికి వెళ్లారని సిఎం కార్యాలయం ఒక ప్రకటన చేసింది. వీరిలో ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ ఛైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, కమిటీ సభ్యుడు సిబికె మహంతి, ఆలయ పాలనాధికారి అరవింద పాడి, పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్, పురావస్తుశాఖ ఇంజనీర్ ఎన్‌సి పాల్, పూరీ రాజప్రతినిధితోపాటు ఐదుగురు ఆలయ సేవాయత్‌లు ఉన్నారు. వీడియోను రికార్డు చేయనున్నామని, ఆ వీడియోను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

మీకోసం

యాలకులను నోట్లో వేసుకుని చప్పరిస్తూ ఉంటే దుర్వాసనతో పాటు నోటి అల్సర్, ఇన్ఫెక్షన్ల వంటి సమస్యలూ తగ్గిపోతాయి.

జీవన సౌరభం

మనకు గల శక్తిని బట్టి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. కానీ మనం చేసే పనులను బట్టి ఇతరులు మనల్ని అంచనా వేస్తారు.

అమ్మ చెప్పింది విందాం!

మబ్బులు చుట్టూ ముసిరాయి
వాన చినుకులు రాలాయి

మట్టి వాసన పొంగింది
మనసంతా ఆనందంతో నిండింది

పరిసరాలు చల్లబడ్డాయి
నీటి కుంటలు నిండాయి

వాన నీటి వయ్యారం
బాల బాలికల సంబరం

వర్షపు నీటిలో తడవద్దు
జ్వరాల బారిన పడవద్దు

అమ్మ చెప్పింది విందాము
హాయిగా ఇంట్లో ఉందాము

- ఏడుకొండలు కళ్ళేపల్లి
మచిలీపట్నం, 94908 32338

జత పరచండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న చెట్లపై ఉన్న అంకెల ఆధారంగా కింద ఉన్న పండ్లకు జత చేయండి.

నేను గీసిన బొమ్మ

ఆర్ ప్రజ్ఞ సునిధి,
5వ తరగతి,
నారాయణ స్కూల్,
మార్కాపూర్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మనీషా 'బ్రేక్' చేసింది ...

తాలిబన్లు వేసిన బాంబుదాడి నుండి వెంట్రుకవాసిలో తప్పించుకుని ఆఫ్ఘన్ నుండి పాకిస్తాన్‌కు చేరుకుంది 18 ఏళ్ల మనీషా. ఆమెతోటే తన పదేళ్ల చిట్టి తమ్ముడు కూడా ఉన్నాడు. 'మనం ఇక్కడ ఉండగలమా? నాకు అనుమానంగానే ఉంది' అని విచారం నిండిన కళ్లతో అక్కని అమాయకంగా అడిగాడు తమ్ముడు. 'మనం తప్పకుండా సాధిస్తాం' అని తమ్ముడి చెయ్యి గట్టిగా నొక్కి చెప్పింది అక్క. 'ఏదైనా సాధించేవరకు ఇక్కడి నుండి వెనక్కి వెళ్లేదిలేదు' అని మనసులో తమ్ముడికి గట్టిగా మాట కూడా ఇచ్చేసింది ఆ రోజు.. ఇప్పుడు అదే జరిగింది. వచ్చే నెలలో పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ఆఫ్ఘన్ తొలి మహిళా బ్రేక్ డ్యాన్సర్‌గా చరిత్ర సృష్టించింది.

'**అ**మ్మని వదిలేసి వచ్చిన మేము ఇద్దరమే మిగిలాం. ఇక్కడికి వచ్చిన దగ్గర నుండి తమ్ముడికి నేను అక్కగా కాదు.. అమ్మలా ఉండాలని మా అమ్మ చెప్పింది. అమ్మ మాట నిలబెట్టుకునేందుకు ఎన్నో కష్టాలు పడ్డాను' అంటోన్న మనీషా, తాలిబన్ పాలన రాకముందు ఆఫ్ఘన్‌లో ఓ డ్యాన్స్ ట్రూప్‌లో డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేది. 55 మంది పురుషులున్న డ్యాన్స్ బృందంలో మనీషా ఒక్కత్తే అమ్మాయి. అంత స్వేచ్ఛ నుండి ఒక్కసారిగా విద్య, ఉపాధి వంటి మౌలిక వసతులకు కూడా అర్హత లేని స్థితికి వచ్చేసింది. తను ఒక్కత్తే కాదు, చుట్టూ ఉన్న సమాజం కూడా తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉంది. ఆ పరిస్థితుల్లో ఊహించని పరిణామంగా మనీషా ఇంటికి కూతవేటు దూరంలో తాలిబన్లు బాంబు దాడికి దిగారు.

'ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని మొదట మేము పాకిస్తాన్ చేరుకున్నాం. ఆ తర్వాత ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో 2022లో స్పెయిన్‌కి వచ్చాం. తమ్ముడు, నేను బతకాలంటే ఏదొక పని కావాలి. అప్పుడే ఒక సెలూన్‌లో పని దొరికింది. అక్కడే నా సహోద్యోగుల ద్వారా స్పానిష్ మాట్లాడడం నేర్చుకున్నాను. వాళ్లల్లో ఒకరు నా డ్యాన్స్ హాబీని తెలుసుకున్నారు. ఆ దిశగా నన్ను ప్రోత్సహించారు. స్పెయిన్ ప్రజలకు నా డ్యాన్స్‌ని పరిచయం చేశారు. ఆ స్నేహితుడి వల్లే ఒలింపిక్స్ కోసం పనిచేసే రెఫ్యూజీ టీమ్ మేనేజర్ నా గురించి తెలుసుకున్నారు' అని తన ప్రయాణం గురించి మనీషా చెబుతోంది.

స్పెయిన్‌లో ఇచ్చిన డ్యాన్స్ ప్రదర్శనల్లో మనీషా తన స్వదేశీ వస్త్రాలంకరణతోనే చేసేది. 'ఇలా చేయడం అమ్మకు ఎంతో ఇష్టం. ఒంటరి మహిళగా అమ్మే మమ్మల్ని పెంచింది. ఎన్నో కష్టాలు పడింది. నేను ఎక్కడున్నా సంతోషంగా ఉంటే చాలు అనేది. అలాంటి అమ్మ కళ్లల్లో ఆనందం చూడాలంటే నేను, నా దేశ దుస్తులతోనే డ్యాన్స్ చేయాలనుకున్నాను. అదే జరిగింది. స్పెయిన్‌కి వచ్చిన ఇన్నేళ్ల తరువాత అంటే మూణ్ణెళ్ల క్రితమే అమ్మ నా దగ్గరకు వచ్చింది. ఆమె, అమ్మ మాత్రమే కాదు.. తను నాకు నాన్న, బెస్ట్ ఫ్రెండ్ కూడా' అని మనీషా తల్లి గురించి ఎంతో గొప్పగా చెప్పింది.

'ఒకప్పుడు మా చుట్టుపక్కల వాళ్లు, 'ఆడపిల్లవి, ఆ కుప్పిగంతులు ఏంటి? అని ఎద్దేవా చేశారు. ఈ రోజు నన్ను, అమ్మని ఎంతో ప్రశంసిస్తున్నారు' అంటున్న మనీషా బంగారు పతకం గెలవడం కోసం ఒలింపిక్స్‌కి వెళ్లడం లేదు. నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతూ విజయశిఖరాలు అధిరోహించే వారి ప్రతినిధిగా వెళుతోంది. ఆమె సాధించిన ఈ విజయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

కూరల్లో ఉప్పు ఎక్కువైందా?

ఒక్కోసారి కూరల్లో ఉప్పు ఎక్కువవుతుంటుంది. ఈ పొరపాటు అప్పుడప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతుంది. అలా ఎక్కువైన ఉప్పును వెనక్కి తీయలేకపోయినా దాని వల్ల కూర రుచి చెడిపోకుండా మాత్రం జాగ్రత్త పడవచ్చు. అదెలాగో చూద్దాం..

- కూరల్లో పొరపాటున ఉప్పు ఎక్కువగా పడితే చాలామందికి వెంటనే గుర్తొచ్చేది నిమ్మరసం. కూరల్లో దీన్ని కలపడం వల్ల ఉప్పు తగ్గుతుంది. ముఖ్యంగా మాంసాహార వంటలు చాలా రుచిగా ఉంటాయి.
- కూరలో ఉప్పు ఎక్కువైనప్పుడు దానికి కొద్దిగా కొబ్బరిపాలు, లేదా పేస్టు కలపాలి. ఇలా చేడయం వల్ల కూరల్లో ఉప్పదనం తగ్గి రుచికరంగా ఉంటుంది.
- పచ్చి బంగాళదుంప తొక్క తీసి, నాలుగు ముక్కలుగా కోసి కూరలో వేయాలి. వీటిని దాదాపు 10 నిమిషాల పాటు అందులో ఉడకనిస్తే ఆ ముక్కలు ఉప్పును పీల్చుకుంటాయి. వడ్డించే ముందు వాటిని కూరలోంచి బయటకు తీసేయాలి.
- కూరలో ఉప్పు ఎక్కువగా పడితే రెండు లేదా మూడు కప్పుల పెరుగును కూరలో కలపడం వల్ల ఉప్పు తగ్గడమే కాదు, చాలా రుచిగా ఉంటుంది. పెరుగు ఇష్టపడని వారు దానికి బదులుగా మీగడ కలుపుకోవచ్చు.
- కూర పరిమాణాన్ని బట్టి ఒకటి లేదా రెండు ఉల్లిపాయలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని, నూనెలో వేయించి కూరలో కలపడం వల్ల ఉప్పదనం తగ్గుతుంది. రుచి పెరుగుతుంది.
- గోధుమ పిండికి కొద్దిగా నీటిని కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకొని, వీటిని కూరలో వేసి 3-4 నిమిషాలు ఉడకనివ్వాలి. ఇవి కూరలో ఎక్కువగా ఉన్న ఉప్పును గ్రహించేస్తాయి. తర్వాత వీటిని బయటకు తీసేయొచ్చు.
- చేసిన వంటకాన్ని బట్టి టమాట ముక్కలు లేదా పేస్టును జత చేయవచ్చు. అప్పటికే కూరలో ఉల్లిపాయ, టమాట పేస్టు వేసినప్పటికీ మరికొంత అదనంగా కలుపుకోవచ్చు. ఇలా చేయడం వల్ల కూరలో ఉప్పు తగ్గుతుంది, రుచీ పెరుగుతుంది. గ్రేవీ ఎక్కువగా వస్తుంది.
- ఒక వేళ కూరలో తక్కువ నీళ్లు ఉంటే కనుక ఇంకా కొన్ని నీళ్లు పోసి కూరను బాగా ఉడికించాలి. లేదా పాలు పోస్తే కూర చాలా రుచిగా మారుతుంది.

జాతీయ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎ.విజయ రాఘవన్

ఒకే గొడుగు కిందకు గ్రామీణ పేదలు

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయ రాఘవన్ పిలుపు
- ఎఐఎడబ్ల్యుయు జాతీయ కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్పొరేట్, మతతత్వ శక్తుల దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు గ్రామీణ పేదలందరినీ ఏకం చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ. విజయ రాఘవన్ పిలుపునిచ్చారు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) జాతీయ కౌన్సిల్ రెండు రోజుల సమావేశం ప్రారంభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల ప్రభావంతో వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు గ్రామీణ పేదల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని అన్నారు. వ్యవసాయ సీజన్‌లో వ్యవసాయ కూలీలుగా, వ్యవసాయ పనులు లేని కాలంలో వ్యవసాయేతర పనులు చేస్తున్న గ్రామీణ పేదలు తమ జీవిత అవసరాలు తీరక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ఆకలి సూచీలో భారత్ 116వ స్థానానికి చేరిందని అన్నారు. 74 శాతం ప్రజలకు పౌష్టికాహారం అందట్లేదని తెలిపారు ఫలితంగా మహిళలు, చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు.. పెరుగుతున్న ధరల వేగంతో కనీస వేతనాలు పెరగటం లేదని, దీంతో గ్రామీణ పేదల జీవితం దారుణంగా తయారైందని అన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తోందని అన్నారు. వంద రోజులు కల్పించాల్సిన పనిదినాలను సగటున 46 రోజులు కూడా కల్పించడం లేదని, ఉపాధి పేదలకు తీవ్రమైన సమస్యగా మారిందని అన్నారు. పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందన్నారు.

ఈ రంగానికి సంబంధించి మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల చట్టాల అమలును ప్రజా పోరాటాలతో తాత్కాలికంగా వెనక్కి కొట్టగాలిగామని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రజలు ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో ఇది స్పష్టంగా రుజువైందని అన్నారు. బిజెపి బలాన్ని కూడా ఎన్నికల్లో ప్రజలు తగ్గించారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఇప్పటివరకు ప్రధానంగా వ్యవసాయ కూలీలను సమీకరిస్తున్నదని, రాబోవు కాలంలో గ్రామీణ పేదలందరినీ ఐక్యం చేసేటువంటి ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశాల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు చర్చించారు. ఈ సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు ఉపాధ్యక్షులు గోవిందన్ మాస్టర్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి నాగయ్య, పి. వెంకట్రాములుతోపాటు జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సిరీస్ సొంతమాయె!

- ఐదో వన్డేలో భారత్ ఘన విజయం
- 4-1తో టీ20 సిరీస్ భారత్ వశం
- సమిష్టిగా మెరిసిన యువ ఆటగాళ్లు

హరారే : విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు దూరం అయ్యారు. దిగ్గజాలు లేకుండానే బరిలోకి దిగిన యువ క్రికెటర్లు.. జింబాబ్వేలో జైత్రయాత్రకు శ్రీకారం చుట్టారు. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకున్నారు. నామమాత్రపు ఐదో మ్యాచ్‌లో ఆతిథ్య జింబాబ్వేపై 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. పొట్టి సిరీస్ ట్రోఫీతో స్వదేశానికి రానుంది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ సంజు శాంసన్ (58, 45 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరువగా, ఆల్‌రౌండర్ శివం దూబె (26, 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) డెత్ ఓవర్లలో ధనాధన్ ఇన్నింగ్స్‌తో శివమెత్తాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ సంజు శాంసన్, శివం దూబె మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఛేదనలో జింబాబ్వే చతికిల పడింది. పేసర్ ముకేశ్ కుమార్ (4/11) నిప్పులు చెరిగే ప్రదర్శనతో 18.3 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. డియాన్ మేయర్స్ (34, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ఫరాజ్ అక్రమ్ (27, 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆతిథ్య జట్టుకు మూడెంకల స్కోరు అందించారు. పేస్ ఆల్‌రౌండర్ శివం దూబె 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. 4-1తో టీ20 సిరీస్ విజయం అందుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పొట్టి సిరీస్ ట్రోఫీ అందుకోవటంతో టీమ్ ఇండియా శిబిరంలో సంబురాలు మొదలయ్యాయి.

ముకేశ్, దూబె నిప్పులు : 168 పరుగుల ఛేదనలో ఆతిథ్య జింబాబ్వే ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. పేసర్ ముకేశ్‌కుమార్ పవర్‌ప్లేలో రెండు వికెట్లతో జింబాబ్వేను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత స్పిన్, పేస్ ఉచ్చులో పడిన జింబాబ్వే బ్యాటర్లు కోలుకోలేదు. టాప్ ఆర్డర్‌లో మారుమని (27), డియాన్ మేయర్స్ (34)లు మెరిసినా.. మిడిల్ ఆర్డర్ నిరాశపరిచింది. కెప్టెన్ సికిందర్ రజా (8), జొనాథన్ కాంప్‌బెల్ (4), క్లైవ్ (1) తేలిపోయారు. టెయిలెండర్లలో ఫరాజ్ అక్రమ్ (27) మెరవటంతో జింబాబ్వే వంద పరుగుల మార్క్ దాటేసింది. ముకేశ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. దూబె రెండు వికెట్లతో చెలరేగాడు. వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ, తుషార్ దేశ్‌పాండే తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

సంజు శాంసన్ మెరుపుల్ : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు ఈసారి ఓపెనర్లు ఆశించిన ఆరంభం అందించలేదు. నాల్గో టీ20లో అజేయ అర్ధ సెంచరీలు బాదిన యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లు పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయారు. యశస్వి (12), గిల్ (13), అభిషేక్ (14) నిరాశపరచగా భారత్ 40/3తో ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో సంజు శాంసన్ (58) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు.

మిడిల్ ఆర్డర్‌లో రియాన్ పరాగ్ (22, 24 బంతుల్లో 1 సిక్స్), శివం దూబె (26)తో కలిసి ఇన్నింగ్స్‌కు ముందుకు తీసుకెళ్లాడు. పరిస్థితులకు అనుగుణంగా ఆడిన సంజు శాంసన్ నాలుగు ఫోర్లతో 39 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. ఆఖర్లో శివం దూబె ధనాధన్‌తో స్కోరు బోర్డు వేగం పుంజుకుంది. రింకూ సింగ్ (11 నాటౌట్) ఓ సిక్సర్‌తో అలరించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్లెసింగ్ (2/19), సికిందర్ రజా (1/37), బ్రాండన్ మావుట (1/39) రాణించారు.

రత్న భాండాగారాన్ని ఎప్పుడెప్పుడు తెరిచారు?

పూరీ : పూరీలోని జగన్నాథ ఆలయం ఉత్తరం వైపున ఉన్న రత్న భాండాగారంలో బలభద్రుడు, జగన్నాథుడు, దేవి సుభద్ర ఆభరణాలున్నాయి. చివరిగా, 1978 మే 13 నుండి జులై 23 వరకు ఆభరణాలు, విలువైన రాళ్ల సమగ్ర జాబితా తయారు చేశారు. ఈ జాబితా ప్రకారం రెండు గదులలో 454 బంగారు వస్తువులు, 293 వెండి వస్తువులు ఉన్నాయని గుర్తించారు. బంగారు వస్తువుల నికర బరువు 128.38 కిలోలు, 293 వెండి వస్తువులు, వాటి బరువు 221.53 కిలోలు ఉన్నాయని పేర్కొన్నారు. 1805లో 64 నగలు మాత్రమే డాక్యుమెంట్ చేయబడ్డాయి. 1952 నాటికి, శ్రీమందిర్ రికార్డ్ ఆఫ్ రైట్స్ ప్రకారం బయటి గదిలో 150 బంగారు ఆభరణాలు, లోపలి గదిలో 180 బంగారు ఆభరణాలు, 146 వెండి వస్తువులు ఉన్నాయి. 1962లో 602 ఆభరణాలున్నాయని నమోదైంది. 1967లో, 433 ఆభరణాలను మాత్రమే ధ్రువీకరించింది. 2008లో, ఒరిస్సా హైకోర్టు సూచనల ప్రకారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) నిర్మాణాన్ని పరిశీలించినా, లోపలి గదిలోకి ప్రవేశించలేకపోయింది. 24 ఏళ్ల పాలనలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం రత్న భాండాగారాన్ని తెరిచేందుకు ప్రయత్నం చేయలేదు. ఆ భాండాగారాన్ని తెరవాలని కోరుతూ ఒరిస్సా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఏళ్ల తరబడి కోర్టుల్లో కేసులు, వాదోపవాదాల అనంతరం భాండాగారం విషయమై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ ఛైర్మన్‌గా ఓ కమిటీ ఏర్పడింది. ఈ ఏడాది జులైలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆ కమిటీని రద్దు చేసింది. జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మందితో ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నిర్ణయం మేరకు భాండాగారాన్ని తెరవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

వింబుల్డన్ విజేత అల్కరాజ్

- జకోవిచ్ రికార్డు ఆశలపై నీళ్లు



లండన్ : 'వింబుల్డన్ 2024 టోర్ని' పురుషుల సింగిల్స్ విజేతగా స్పెయిన్‌కు చెందిన యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ నిలిచాడు. వరసగా రెండో ఏడాది ఈ టైటిల్‌ను అల్కరాజ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ప్రత్యర్థి, 24 గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన సెర్బియా ఆటగాడు జకోవిచ్‌పై 6-2, 6-2, 7-6 (7-4)తో అల్కరాజ్ విజయం సాధించాడు. తొలి రెండు సెట్‌లను అవలీలగా గెలిచిన అల్కరాస్‌కు.. మూడో సెట్‌లో జకోవిచ్ చుక్కలు చూపించాడు. దీంతో ఇద్దరూ హోరాహోరీ పోరాడారు. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన మూడో సెట్ 6-6తో సమం కావడంతో మ్యాచ్ ట్రై బ్రేకర్‌కు వెళ్లింది. ఇక్కడ కూడా ఇద్దరు ఆటగాళ్లు కూడా తీవ్రంగా పోరాటం చేశారు. అయితే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించిన అల్కరాజ్ బంతిని స్పిన్ చేస్తూ.. జకోవిచ్‌ను నెట్ దగ్గరకు రప్పించి.. మెరుపు వేగంతో షాట్లు కొట్టి పాయింట్లు రాబట్టాడు. మరోవైపు జకోవిచ్ కూడా తనదైన వ్యూహాలతో అల్కరాజ్నుడి చేసేందుకు ప్రయత్నించాడు. కానీ, ట్రై బ్రేకర్‌లో అల్కరాజ్4తో జకోవిచ్‌ను పక్కకు నెట్టి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. దీంతో వరుసగా రెండోసారి వింబుల్డన్ విజేతగా నిలిచాడు. దీంతో ఆదివారం ఫైనల్లో విజయం సాధించి తన కెరీర్‌లో రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ సొంతం చేసుకోవాలని భావించిన జాకోవిచ్ కల చెదిరిపోయింది. మార్గరెట్ కోర్ట్ (24 గ్రాండ్‌స్లామ్‌లు)ను అధిగమించి టెన్నిస్‌లో అత్యధిక టైటిళ్ల రికార్డు నెలకొల్పాలన్న జకోవిచ్ లక్ష్యం నెరవేరలేదు. మరో టోర్నిలో విజయం కోసం 37 ఏళ్ల జకోవిచ్ వేచిచూడాల్సిన పరిస్థితిని అల్కరాజ్ కల్పించాడు. జకోవిచ్‌కు ఇది కెరీర్‌లో 10వ వింబుల్డన్ టోర్ని ఫైనల్. మరోవైపు ఈ విజయంతో అల్కరాజ్ తన కెరీర్‌లో ఫైనల్‌కు చేరుకున్న నాలుగు గ్రాండ్ స్లామ్ టోర్నీలో టైటిల్ విజేతగా నిలిచినట్లయింది. ఇప్పటి వరకూ రెండు వింబుల్టన్ ట్రోఫీలతో పాటు 2022లో యూఎస్ ఓపెన్ టైటిల్‌ను, గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్స్ కూడా అల్కరాజ్ -జకోవిచ్ మధ్యనే జరిగింది. 2023లో అల్కరాస్ 1-6, 7-6, 6-1, 3-6, 6-4తో విజయం సాధించి తొలి వింబుల్డన్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

21 ఏళ్లకే నాలుగు గ్రాండ్ స్లామ్స్

ఈ విజయంతో అధునిక యుగంలో 21 ఏళ్లకే నాలుగు గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సాధించి, పిన్న వయస్సులో అత్యధిక గ్రాండ్ స్లామ్స్ సాధించిన వారి జాబితాలోకి అల్కరాజ్ చేరాడు. బోరిస్ బెకర్, జోర్న్ బోర్గ్, మాట్స్ విలండెర్ కూడా 21 ఏళ్లకే నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించారు.

సెమాగ్లుటైడ్‌తో దృష్టిని కోల్పోయే ప్రమాదం!

న్యూఢిల్లీ : బోస్టన్ పరిశోధకులు నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం ప్రముఖ యాంటీ డయాబెటిక్ డ్రగ్ సెమాగ్లుటైడ్ దృష్టిని కోల్పోయే ప్రమాదంతో ముడిపడి ఉండే అవకాశమున్నది. 2024లో సెమాగ్లుటైడ్ మార్కెట్ పరిమాణం 27.55 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఇది 2029 నాటికి 50.34 బిలియన్ డాలర్లకు చేరుతుందనీ, ఇది 12.8 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) వద్ద పెరుగుతుందని అంచనా. డానిష్ డ్రగ్ మేజర్ నోవో నార్డిస్క్ ద్వారా ఈ ఔషధాన్ని వెగోవి, రైబెల్సస్, ఓజెంపిక్ బ్రాండ్ పేర్లతో విక్రయిస్తున్నారు. 'రిస్క్ ఆఫ్ నానార్టెరిటిక్ యాంటీరియర్ ఇస్కీమిక్ ఆప్టిక్ న్యూరోపతి ఇన్ పేషెంట్స్ ప్రిస్క్రైబ్డ్ సెమాగ్లుటైడ్' పేరుతో ఈ అధ్యయనం మెడికల్ జర్నల్ 'జామా' ఆప్తాల్మాలజీలో ప్రచురించారు.

83వ జయంతి స్మరణ

కీ॥శే॥ సూరా హనుమంతరావు గారు
Superintendent (Retd)
Chief Engineering Office
R & B Dept, Erramanzil, Hyderabad
జననం : 15-7-1941 మరణం : 22-3-2018

నా భర్త గారు సూరా హనుమంతరావు గారి 83వ జయంతి స్మరణ
మీ జ్ఞాపకాలు మాకు మరపురానివి, మరువలేనివి..
మీ రూపము సదా చిరస్మరణీయం...
మీకు మా దివ్యనీరాజనాలు....
ఇట్లు మీ భార్య సూరా జానకీదేవి
మీ ఏకైక కుమారుడు సూరా కళ్యాణ చక్రవర్తి M.A.LL.B
మీ తమ్ముడు - మరదలు
సూరా ఆదినారాయణ - సూరా రంగవల్లి
మరియు బంధుమిత్రులు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68